



RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.

సంచిక : 313 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | ఆదివారం | 01-03-2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00

# మీ ప్రభుత్వంపై తిరగబడండి

- మీకు అండగా మా సైనిక శక్తి ఉంటుంది
- ఇరాన్ ప్రజలకు ట్రంప్ సందేశం




**వాషింగ్టన్, ఫిబ్రవరి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
అమెరికా–ఇజ్రాయెల్ సంయుక్తంగా ఇరాన్‌పై చేపట్టిన దాడులను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ధ్రువీకరించారు. ఎన్ని హెచ్చరికలు చేసినా అణుకేంద్రాల పునర్నిర్మాణం, క్షిపణులను అభివృద్ధి చేస్తుండటంతో ఇరాన్‌పై భారీ సైనిక చర్య చేపట్టామని ప్రకటించారు. -మిగతా 2 లో

# ఇరాన్‌పై ఇజ్రాయిల్, అమెరికా దాడి

- స్కూలుపై బాంబు దాడి.. 50 మందికి పైగా విద్యార్థులు మృతి
- దక్షిణ ఇరాన్‌లో 70 మంది మరణం
- తిప్పికొడుతున్న ఇరాన్..
- యుఎస్ స్థావరాలే లక్ష్యంగా క్షిపణులు ప్రయోగం
- తాజా పరిస్థితులపై రష్యా ఆగ్రహం



**దుబాయ్ ఫిబ్రవరి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మధ్యప్రాచ్యంలో యుద్ధవాతావరణం నెలకొన్నది. ఇరాన్‌పై ఇజ్రాయిల్, అమెరికా సేనలు శనివారం పెద్ద ఎత్తున విరుచుకుపడ్డాయి. ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ, ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ నివాసం, నిఘా ప్రధాన కార్యాలయం సహా మొత్తం 30 ప్రాంతాలు లక్ష్యంగా ఈ దాడులు జరిగినట్టు తెలుస్తోంది. -మిగతా 2 లో

# భారత్‌పై యుద్ధ ప్రభావం?

- అంతర్జాతీయ ఉద్రిక్తతలతో ముడి చమురు ధరలపై ఒత్తిడి
- గల్ఫ్ ప్రాంత అస్థిరత సరఫరా అంతరాయం భయం
- ముడి చమురు పెరిగితే పెట్రోల్ ధరలు వెంటనే పెరుగుతాయా?
- రూపాయి-డాలర్ మారకం, పన్నుల ప్రభావం ఎంత?
- ఇంధన ధరల పెరుగుదలతో ద్రవ్యోల్బణ ముప్పు
- ప్రభుత్వ చర్యలపై ఆధారపడే తుది నిర్ణయం




**న్యూఢిల్లీ**
మధ్యప్రాచ్యంలో యుద్ధ ఉద్రిక్తతలు తీవ్రరూపం దాల్చుతున్న నేపథ్యంలో ప్రపంచ మార్కెట్లలో ముడి చమురు ధరలు పెరుగుతున్నాయి. ఈ పరిణామాలు భారత్‌లో పెట్రోల్, డీజిల్ ధరలపై ప్రభావం చూపుతాయా? అనే సందేహం ప్రజల్లో వ్యక్తమవుతోంది. భారత్ తన అవసరాలకు సరిపడే ముడి చమురులో దాదాపు 80‹85 శాతం వరకు దిగుమతులపైనే ఆధారపడుతుంది. అందువల్ల అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు పెరిగితే, దాని ప్రభావం దేశీయ ఇంధన ధరలపై పడే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. యుద్ధం లేదా భౌగోళిక ఉద్రిక్తతలు పెరిగినప్పుడు చమురు సరఫరాపై అనిశ్చితి ఏర్పడుతుంది. ముఖ్యంగా గల్ఫ్ దేశాలు ప్రపంచ చమురు సరఫరాలో కీలక పాత్ర పోషిస్తాయి. అక్కడ పరిస్థితులు అస్థిరంగా మారితే: సరఫరా అంతరాయం భయం పెరుగుతుంది. రవాణా మార్గాల భద్రతపై అనుమానాలు రేకెత్తుతాయి. బీమా ఖర్చుల పెరుగుదల అనివార్యమవుతుంది. ట్రేడింగ్ మార్కెట్‌లో ఊహాగానాలు ఊపందుకుంటాయి.ఇన్ని కారణాల వల్ల ముడి చమురు ధరలు ఒక్కసారిగా ఎగసిపడే అవకాశం ఉంది.భారత్‌లో వెంటనే పెట్రోల్ ధరలు పెరుగుతాయా, -మిగతా 2 లో

## ప్రజలకు మేలు చేయడమే

# ప్రభుత్వ లక్ష్యం

### ప్రతి ఎన్నికల్లోను ప్రజలు అండగా ఉన్నారు

- పారిశ్రామికీకరణలో తెలంగాణ ఆదర్శం కావాలి
- పాత పద్ధతి నుంచి..సాంకేతికంగా అప్‌డేట్ కావాల్సిందే
- ఆన్‌లైన్ విధానంలో అన్ని పనులు జరిగేలా చూడాలి
- నిర్ణీత సమయంలో ఫైళ్లు క్లీయర్ చేయాల్సిందే
- 99 రోజుల యాక్షన్ ప్లాన్‌పై అధికారులతో చర్చ
- ఫ్యూచర్ సిటీపై దృష్టి పెట్టి పనిచేయండి
- అధికారులకు దిశానిర్దేశం చేసిన సిఎం రేవంత్



**ప్రతిప్రభుత్వ ఆఫీస్‌కు సొంత భవనం ఉండాల్సిందే**

**హైదరాబాద్, ఫిబ్రవరి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
సీఎం రేవంత్‌రెడ్డి శనివారం సచివాలయంలో వివిధ శాఖలకు చెందిన ప్రభుత్వ ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. 99 రోజుల యాక్షన్ ప్లాన్‌పై సమావేశంలో అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా పలు కీలక అంశాలపై సీఎం దిశానిర్దేశం చేశారు. మార్చి నుంచి జూన్ వరకు 99 రోజుల యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ శివధర్ రెడ్డి, సీఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సీఎంఓ అధికారులు పాల్గొన్నారు. మార్చి 4 న జరిగే కలెక్టర్ల సమావేశంలో అందరి పని తీరుపైన -మిగతా 2 లో



# ఆయిల్ పామ్ సాగును లాభసాటిగా చేయడమే ప్రభుత్వ లక్ష్యం

- టన్నుకు 21546-లకు చేరుకున్న గెలల ధర
- 15024 మంది రైతులకు రూ. 2 కోట్ల మేర అదనపు లబ్ది
- ఆయిల్ ఫెడ్ ఫాక్టరీలలో ఆధునిక యంత్రాల ఏర్పాటు
- మంత్రి తుమ్మల నాగేశ్వర రావు వెల్లడి

**హైదరాబాద్, ఫిబ్రవరి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నదని, రాష్ట్రంలో పంట మార్పిడి ఆవశ్యకత మరియు వంట నూనెలను డిమాండ్ ను దృష్టిలో ఉంచుకొని ఆయిల్ పామ్ సాగును రాష్ట్రంలో పెద్ద ఎత్తున్న చేపట్టడానికి ప్రభుత్వం నిర్ణయించిందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలియజేసారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన నాటికి టన్నుకి ఆయిల్ పామ్ గెలల ధర రూ12534 /- ఉండగా ఈ నెల ఆయిల్ పామ్ గెలల ధర రూ21546/- పెరగడం తో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. పెరుగుతున్న ధరలను దృష్టిలో ఉంచుకొని రైతులు ఆయిల్ పామ్ సాగుకు ముందుకు రావాలని మంత్రివర్యులు పేర్కొన్నారు. -మిగతా 2 లో

## టీ20 వరల్డ్‌కప్ నుంచి

# పాకిస్తాన్ ఎలిమినేట్..

- చెమటలు పట్టించిన శ్రీలంక, సెమీస్‌కు న్యూజిలాండ్!
- శ్రీలంకను 147లోపు కట్టడి చేయడంలో పాక్ విఫలం
- 20 ఓవర్లలో 207 పరుగులు చేసిన శ్రీలంక
- నెట్‌రన్‌రేట్ కారణంగా టోర్నీ నుంచి నిష్క్రమించిన పాక్
- ఆఖరి మ్యాచ్‌లోనూ 6 పరుగుల తేడాతో ఓడిన శ్రీలంక




**న్యూఢిల్లీ**
ఐసీసీ టీ20 వరల్డ్‌కప్ సూపర్ 8 గ్రూప్ నుంచి ఏ జట్టు సెమీస్‌కు చేరుతుందని అందరూ టెన్షన్ పడ్డారు. ఇంగ్లండ్ వరుస విజయాలతో సెమీఫైనల్‌లో అడుగుపెట్టగా.. రెండో జట్టు న్యూజిలాండా, పాకిస్తానా అని అందరూ టెన్షన్‌లో మునిగిపోయారు. పల్లెకెలె వేదికగా జరిగిన మ్యాచ్ పాకిస్తాన్ భారీ స్కోర్ సాధించి కేవలం 6 పరుగుల తేడాతో విజయం సాధించినప్పటికీ, నెట్‌రన్‌రేట్ కారణంగా టోర్నీ నుంచి ఎలిమినేట్ అయింది. న్యూజిలాండ్, పాక్ పాయింట్లలో సమానంగా ఉన్నప్పటికీ నెట్‌రన్‌రేట్ కారణంగా కివీస్ సెమీస్‌లో అడుగుపెట్టింది.పల్లెకెలె వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన శ్రీలంక జట్టు బౌలింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్‌కి దిగిన పాకిస్తాన్ జట్టు విధ్వంసం సృష్టించింది. ఓపెనర్లు షాహిబ్‌జాదా ఫర్హాన్ - ఫఖర్ జమాన్ రికార్డు స్థాయిలో తొలి -మిగతా 2 లో

## 41 మంది ఐఏఎస్‌లకు

# కేంద్రంలో సెక్రటరీ హోదా

- ఆమోదించిన క్యాబినెట్ నియామకాల కమిటీ
- తెలంగాణ కేడర్‌లో సంజయ్‌కుమార్‌కు కూడా..

**హైదరాబాద్,**
దేశంలోని పలు రాష్ట్రాల కేడర్‌లలో పనిచేస్తున్న ఐఏయ్‌సలకు వారి హోదాను పెంచుతూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. 41 మంది ఐఏఎస్‌లకు (1990–1995 బ్యాచ్) సెక్రటరీ హోదా కల్పిస్తూ క్యాబినెట్ నియామకాల కమిటీ ఆమోదం తెలిపింది. ఆ వివరాలను సంబంధిత ఔధికారులకు తెలుపుతూ సమాచార పత్రాన్ని శనివారం పంపింది. ఇందులో భాగంగా తెలంగాణ కేడర్‌లో ఉన్న




ఐఏయస్ సంజయ్‌కుమార్‌కు కూడా కేంద్రంలో సెక్రటరీ స్థాయి హోదా దక్కింది. ప్రస్తుతం సంజయ్‌కుమార్ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖకు ప్రత్యేక ముఖ్య కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు




## డూ ఆర్ డై మ్యాచ్‌కు

# సిద్ధమైన టీమిండియా

- వెస్టిండీస్‌తో టీమిండియా అమీతుమీ సిద్ధం
- నేడు కోల్‌కతా వేదికగా వెస్టిండీస్‌తో మ్యాచ్
- గెలుపే ప్రధాన లక్ష్యంగా బరిలోకి ఇరు జట్లు

**కోల్‌కతా ఫిబ్రవరి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీలో టీమిండియా డూ ఆర్ డై మ్యాచ్‌కు సిద్ధమైంది. తమ ఆఖరి సూపర్–8 పోరులో భాగంగా నేటి(ఆదివారం) రాత్రి కోల్‌కతా వేదికగా జరిగే మ్యాచ్‌లో వెస్టిండీస్‌తో టీమిండియా అమీతుమీ తేల్చుకోనుంది. ఇరు జట్లకు ఈ మ్యాచ్ క్వార్టర్ ఫైనల్ లాంటిది. ఇందులో గెలిచిన జట్టు సెమీస్ చేరనుండగా.. ఓడిన జట్టు టోర్నీ నుంచి నిష్క్రమించనుంది. దాంతో ఈ మ్యాచ్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. -మిగతా 2 లో

## టీచర్ల జీతాలను తగ్గించాలని చెప్పడం

# సిగ్గుచేటు

### ఆ రిపోర్టును చెత్తబుట్టలో వేయాలి



- విద్యాశాఖకు మంత్రి లేరనే విషయాన్ని కూడా గుర్తించని కమిషన్ ఎందుకు
- కనీస ఉత్తీర్ణత మార్కులను 35 నుంచి 45కు పెంచడం దుర్మార్గం
- పేద విద్యార్థులు స్కూల్ స్థాయిలోనే ఫెయిలై ఉన్నత విద్యకు దూరమయ్యే ప్రమాదం
- సీఎం రేవంత్ తీరుపై మండిపడ్డ బండి సంజయ్


**హైదరాబాద్ ఫిబ్రవరి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఇటీవల సిఎం రేవంత్‌కు సమర్పించిన విద్యా కమిషన్ రిపోర్టును చెత్తబుట్టలో వేయాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఎద్దేవా చేశారు. విద్యారంగ అభ్యున్నతి కోసం సిఫారసులేవని ప్రశ్నించారు. టీచర్ల జీతాలను తగ్గించాలని చెప్పడం సిగ్గుచేటని అన్నారు. ఈ మేరకు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిపై బండి సంజయ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.విద్యావేత్తలు లేని విద్యా కమిషన్ ఇదని విమర్శించారు. శనివారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో బండి సంజయ్ మాట్లాడారు. -మిగతా 2 లో



# కేన్సర్ అరికట్టడమే లక్ష్యం

- హెచ్‌పివి టీకా డ్రైవ్‌ను ప్రారంభించిన ప్రధాని మోడి

**రాజస్థాన్**
కేన్సర్ అరికట్టడమే లక్ష్యంగా దేశవ్యాప్తంగా బాలికలకు అందజేసే హెచ్‌పివి టీకా కార్యక్రమం శనివారం ప్రారంభమైంది. రాజస్థాన్ అజ్మీర్‌లోని కయాద్‌లో ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఈ కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారులతో మాట్లాడారు. మహిళల్లో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌తోపాటు, నివారించదగిన మరికొన్ని రకాల క్యాన్సర్లను అరికట్టడమే లక్ష్యంగా కేంద్రం హెచ్‌పివి టీకా కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులో భాగంగా 14 సంవత్సరాల బాలికలకు 'గార్డాసిల్' అనే టీకాను ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా ఇవ్వనున్నారు. ఈ వ్యాక్సిన్ హెచ్‌పివి టైప్ 16, 18తో పాటు టైప్ 6, 11 రకాల నుంచి ఇది రక్షణ కల్పించనున్నట్లు కేంద్రం వివరించింది. ఈ డ్రైవ్ ప్రారంభం కావడంతో హెచ్‌పివి వ్యాక్సినేషన్ ప్రారంభించిన 160 కంటే ఎక్కువ దేశాల్లో స్థానం పొందింది. ఈ డ్రైవ్‌లో భాగంగా 9.84 లక్షల మంది బాలికలకు టీకాలను వేయనున్నట్లు మహారాష్ట్ర తెలిపింది. దేశవ్యాప్తంగా ఉన్న 14 ఏళ్ల బాలికలందరికీ ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు (పిహెచ్‌సిలు), కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, డిస్ట్రిక్ట్, సబ్ డిస్ట్రిక్ట్ ఆసుపత్రులు, ప్రభుత్వ మెడికల్ కళాశాల ఆసుపత్రులలో ఒకే మోతాదులో ఉచితంగా వేస్తారని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ పేర్కొంది.




# బద్ధ శత్రువులుగా ఒకనాటి మిత్రులు

- 1979కి ముందు ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య స్నేహం..
- ఇరాన్‌లో ఇస్లామిక్ విప్లవంతో మారిన పరిస్థితి
- ఇజ్రాయెల్‌ను శత్రువుగా ప్రకటించిన ఇరాన్
- ఇరాన్‌తో తన మనుగడకే ముప్పు ఉందని ఇజ్రాయెల్ భావన

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఇజ్రాయెల్ మధ్య దశాబ్దాలుగా కొనసాగుతున్న శత్రుత్వం పశ్చిమాసియాను మరోసారి తీవ్ర సంక్షోభంలోకి నెట్టింది. ఇరాన్‌ను అణచివేసేందుకు ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ పేరుతో అమెరికా, ఆపరేషన్ రోరింగ్ లయన్ పేరుతో ఇజ్రాయెల్ శనివారం నుంచి దాడులు మొదలుపెట్టాయి. ఇరాన్ కూడా ప్రతి దాడులు చేస్తోంది. అయితే, ఈ దేశాల మధ్య మొదటి నుంచి శత్రుత్వం లేదు. -మిగతా 2 లో

## మీ ప్రభుత్వంపై తిరగబడండి



మొదటి తరువాయి

ఇరాన్ ప్రజలకు బహిరంగంగా తొలిసారి కీలక సందేశం ఇచ్చారు. దశాబ్దాలుగా అణచివేతకు గురవుతున్న ఇరాన్ ప్రజలకు ఇది విముక్తి కల్పించే సందర్భమని అన్నారు. 'ఇరాన్ ప్రజలకు విముక్తి కలిగించే సందర్భం వచ్చింది. తరతరాలకు మీకు లభించే ఏకైక గొప్ప అవకాశం ఇదే కావచ్చు. అమెరికా పూర్తి సైనిక శక్తితో అండగా నిలుస్తుంది. మేము పని పూర్తి చేసే సమయానికి మీ ప్రభుత్వాన్ని మీరు స్వాధీనం చేసుకోవాలి' అని ఇరాన్ ప్రజలకు ట్రంప్ పిలుపునిచ్చారు. ఇరాన్ భద్రతా దళాలను ఉద్దేశించి మాట్లాడుతూ, తక్షణమే వారు ఆయుధాలు విడిచిపెట్టాలని, అలాచేస్తే వారికి రక్షణ కల్పిస్తామని, తిరగబడితే మరణం తప్పదని హెచ్చరించారు. ఈ చారిత్రక ఘట్టంలో ఇరాన్ ప్రజలకు అమెరికా పూర్తి సైనిక శక్తితో అండగా ఉంటుందన్నారు. గతంలో ఏ అమెరికా అధ్యక్షుడు ఈ తరహాలో స్పందించేందుకు ముందుకు రాలేదన్నారు. కాగా, 'అపరేషన్ షీల్డ్ ఆఫ్ జూడా' పేరుతో ఇరాన్‌పై ఇజ్రాయెల్ శనివారంనాడు క్షిపణి దాడులు జరిగింది. ఈ దాడులలో రాజధాని నగరమైన టెహ్రాన్‌లో పలు ప్రాంతాలు దద్దరిల్లాయి. ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా ఖమేనీ కార్యాలయం సమీపంలో దాడులు జరగడంతో కలకలం రేగింది. ఇరాన్ ప్రతిదాడికి దిగొచ్చంటూ ఇజ్రాయెల్ తన పౌరులను హెచ్చరించింది. ముందస్తుగా ఇరాన్, ఇజ్రాయెల్‌లు తమ గగనతలాలను మూసివేశాయి. మరోవైపు, ఇరాన్‌లోని భారతీయ పౌరులకు అక్కడి ఇండియన్ ఎంబసీ
కీలక సూచనలు చేసింది. అప్రమత్తంగా ఉండాలని, అనవసర ప్రయాణాలు పెట్టుకోవద్దని, ఇళ్లల్లోనే ఉండాలని సూచించింది. అధికారుల సూచనలను తూచా తప్పకుండా పాటించాలని కోరింది.

## భారత్‌పై యుద్ధ ప్రభావం?

మొదటి తరువాయి

అనేది ప్రస్తుతం భయం కలిగిస్తోన్న సందేహం. పెట్రోల్, డీజిల్ ధరలు నేరుగా ముడి చమురు ధరలకే పరిమితం కావు. రూపాయి c డాలర్ మారకం విలువ అనేవి వాటిపై ప్రభావం చూపే అంశాలు అవేకాక, కేంద్ర, రాష్ట్ర పన్నులు, ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల ధరల విధానం, ప్రభుత్వం తీసుకునే ధర నియంత్రణ నిర్ణయాలు, ముడి చమురు ధరలు పెరిగినా, ప్రభుత్వం పన్నుల్లో సర్దుబాటు చేస్తే వినియోగదారులపై భారం తగ్గే అవకాశం ఉంది. అయితే అంతర్జాతీయంగా ధరలు నిరంతరం పెరిగితే, దేశీయంగా కూడా పెట్రోల్, డీజిల్ రేట్లు పెరగడం అనివార్యం కావచ్చని ఆర్థిక నిపుణుల అంచనా. ఇంధన ధరల పెరుగుదల ద్రవ్యోల్బణంపై ప్రభావం చూపుతుంది. రవాణా ఖర్చులు పెరిగితే సరుకుల ధరలు కూడా పెరిగే ప్రమాదం ఉంటుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం పన్నుల తగ్గించవచ్చు. వ్యూహాత్మక చమురు నిల్వలను వినియోగంలోకి తేవచ్చు. పెట్రోల్ ధరల పెరుగుదల కేవలం వాహనదారులకే కాకుండా, మొత్తం ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతుంది. రవాణా, వ్యవసాయం, తయారీ రంగాల్లో ఖర్చులు పెరిగే అవకాశం ఉంది. ఫలితంగా నిత్యావసర వస్తువుల ధరలపై కూడా ఒత్తిడి ఏర్పడుతుంది. ప్రస్తుతం యుద్ధ పరిస్థితుల ప్రభావంతో అంతర్జాతీయ చమురు మార్కెట్లు ఆందోళనలో ఉన్నప్పటికీ, భారత్‌లో పెట్రోల్ ధరలు వెంటనే పెరుగుతాయా లేదా అన్నది ప్రభుత్వ విధానాలపై ఆధారపడి ఉంటుంది. అయితే ఉద్రిక్తతలు దీర్ఘకాలం కొనసాగితే ఇంధన ధరల పెరుగుదల అవకాశాన్ని పూర్తిగా కొట్టిపారేయలేమని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## టీచర్ల జీతాలను తగ్గించాలని చెప్పడం సిగ్గుచేటు

మొదటి తరువాయి

అర్బన్ నక్సలైట్ ఆధ్వర్యంలో వేసిన కమిషన్‌కు విలువేముందని నిలదీశారు. విద్యాశాఖకు మంత్రి లేరనే విషయాన్ని కూడా గుర్తించని కమిషన్ ఎందుకని బండి సంజయ్ ప్రశ్నల వర్షం కురిపించారు. చాక్ పీసులకు పైసల్లేక, స్కావెంజర్లు లేక స్కూళ్లు అల్లాడుతుంటే పరిష్కార మార్గాలు చూపరా..? అని ఫైర్ అయ్యారు. కనీస ఉత్తీర్ణత మార్కులను 35 నుంచి 45కు పెంచడం దుర్మార్గమని అన్నారు. పేద విద్యార్థులు స్కూల్ స్థాయిలోనే ఫెయిలై ఉన్నత విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. విద్యావేత్తలు, ఉపాధ్యాయ సంఘాలతో, విద్యార్థుల తల్లిదండ్రుల అభిప్రాయాలను తీసుకోకుండా రూపొందించిన ఏకపక్ష నివేదిక ఇదని ధ్వజమెత్తారు. ఉపాధ్యాయులను విద్యా కమిషన్ అవమానించిందని బండి సంజయ్ మండిపడ్డారు. స్థానిక పరిస్థితులను పట్టించుకోకుండా విదేశాల్లో తిరిగి నివేదిక ఇస్తే ఒరిగేదేముంది..? అని ప్రశ్నల వర్షం కురిపించారు. ఉపాధ్యాయులారా...మీకు అండగా బీజేపీ ఉంటుందని భరోసా కల్పించారు. ఇళ్ల కూల్చివేతలో రేవంత్‌రెడ్డికి గిన్నిస్ రికార్డు ఖాయమని ఎద్దేవా చేశారు. మావోయిస్టుల విషయంలో రేవంత్‌రెడ్డిది ద్వంద్వ వైఖరి అని ఆగ్రహించారు. అర్బన్ నక్సలైట్లను కమిటీల్లో వేస్తారని... లొంగిపోయిన మాజీలను ప్రోత్సహిస్తున్నారని బండి సంజయ్ దుయ్యబట్టారు.

## బద్ధ శత్రువులుగా ఒకనాటి మిత్రులు




కొన్ని దశాబ్దాల క్రితం ఇరాన్‌తో అమెరికా, ఇజ్రాయెల్ సంబంధాలు మామూలుగానే ఉండేవి. ఒకరకంగా చెప్పాలంటే ఈ దేశాలు నాడు మంచి మిత్రులు. 1979కి ముందు ఇరాన్‌ను పాలించిన రాజు మొహమ్మద్ రెజా షా పహ్లావీ.. ఇజ్రాయెల్, అమెరికాతో మంచి సంబంధాలు నెలకొల్పారు. నాడు ఇజ్రాయెల్‌తో కలిసి ఇరాన్ క్షిపణులను అభివృద్ధి చేసే కార్యక్రమం కూడా చేపట్టింది. ఈ రెండు దేశాల మధ్య మంచి వాణిజ్య సంబంధాలుండేవి. ఇరాన్ రాజుకు అమెరికా నుంచి అన్ని విషయాల్లో మద్దతు లభించేంది.

# ఇరాన్‌పై ఇజ్రాయిల్, అమెరికా దాడి

మొదటి తరువాయి

దక్షిణ ఇరాన్‌లోని మినాబ్‌లో ఉన్న ప్రాథమిక బాలికల పాఠశాలపై జరిగిన దాడిలో 50 మందికి పైగా విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు. ఇక్కడి హొర్మోజ్‌గాన్ ప్రావిన్స్‌లో మృతుల సంఖ్య 70కి చేరుకుందని అక్కడి అధికారులు చెప్పారు. 90 మందికి పైగా గాయాలయ్యాయని తెలిపారు. ఇరాన్ కూడా ఇజ్రాయిల్-అమెరికా సేనలకు ధీటుగా బదులిస్తోంది. ఏ మాత్రం వెనక్కి తగ్గకుండా ఎదురు దాడులు చేస్తోంది. 70 ఖండాంతర క్షిపణులను ఇరాన్ ప్రయోగించింది. కువైట్, ఖతార్, యూఏఈ, జోర్డాన్ వంటి పది గల్ఫ్ దేశాలలోని ఇజ్రాయిల్, అమెరికా స్థావరాలపై క్షిపణులు ప్రయోగించింది. ఇరాన్ నాయకత్వంపై తిరుగుబాటు చేయాలని, ప్రభుత్వాన్ని హస్తగతం చేసుకోవాలని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఆ దేశ ప్రజలను రెచ్చగొట్టారు. ఇరాన్ సుప్రీం నేత అయతొల్లా అలీ ఖమేనీ కార్యాలయాలను లక్ష్యంగా చేసుకొని తొలి దాడులు జరిగాయి. కెర్మన్‌షా, క్వమ్, ఇస్ఫహాన్, తబ్రిజ్, కరజ్‌లోని సైనిక స్థావరాలు, అలాగే దక్షిణాన ఉన్న కెనరాక్‌లోని నౌకాదళ స్థావరంపై దాడులు జరిగాయి. కుర్దిష్ ప్రాంతంలోని కమ్యరాన్ నగరంలో ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జిసి) స్థావరంపై కూడా బాంబు దాడి జరిగింది. దేశంలోని వివిధ ప్రాంతాలలో దాడులు జరుగుతున్నాయని, రాజధాని టెహ్రాన్‌లోని నివాస భవనాలు, దుకాణాల నుంచి దట్టమైన పొగలు వ్యాపించాయని ఇరాన్ మీడియా తెలిపింది.

**సురక్షిత ప్రాంతానికి ఖమేనీ?**

ఇజ్రాయిల్-అమెరికా దాడుల తర్వాత 86 సంవత్సరాల ఖమేనీని ఇరాన్ సేనలు సురక్షిత ప్రాంతానికి తరలించినట్టు తెలుస్తోంది. ఆయన బంకర్‌లోకి వెళ్లినట్టు సమాచారం. క్షిపణి లాంఛర్లు సహా వందలాది ఇరాన్ సైనిక లక్ష్యాలపై దాడి చేశామని ఇజ్రాయిల్ సైన్యం చెప్పుకుంది. టెహ్రాన్ సమీపంలోని నర్మక్‌లో ఇరాన్ మాజీ అధ్యక్షుడు మహమూద్ అహ్మదినెజాద్ నివసిస్తున్న ఇంటి పైనా దాడి జరిగింది.

# ప్రజలకు మేలు చేయడమే ప్రభుత్వ లక్ష్యం

మొదటి తరువాయి

మాట్లాడుతానని అన్నారు. ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక పేరు తో 99 రోజుల కార్యాచరణ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమం కోసం ప్రత్యేక లోగో తయారు చేస్తున్నాం..కేంద్రం ఏర్పాటు చేసిన ఏ ఐ సమావేశం నిర్వహణ పైన కొన్ని విమర్శలు వచ్చాయి..కానీ తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్ అందరి దృష్టిని ఆకర్షించిందన్నారు. ప్రణాళికా బద్ధంగా జీహెచ్ ఎం సీ ని మూడు కార్పొరేషన్ లు గా విభజించాం..కోర్ అర్బన్ రీజియన్ లో చేపట్టాల్సిన కార్యాచరణ పైన అధికారులు దృష్టి పెట్టాలి..ఫ్యూర్ అర్బన్ రీజియన్ 10 వేల చదరపు కిలో మీటర్ల పరిధిలో విస్తరించి ఉంది..ఇక్కడ మాన్యుఫాక్చరింగ్ రంగం విస్తరించాలి. పారిశ్రామికీకరణ లో తెలంగాణ దేశానికి ఆదర్శంగా ఉండాలని అంటూ.. దీనిపైన అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సేవా రంగంలో వస్తున్న పెను మార్పులు గమనంలోకి తీసుకోవాలి..శాఖలపైన ప్రతి ఒక్కరికి సంపూర్ణ అవగాహన ఉండాలి.. శాఖలల్లో పనిచేస్తున్న ఉద్యోగులు,అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జాబితా సిద్ధం చేయాలి..ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లో ఉండడానికి వీలు లేదు.. ప్రతి శాఖకు సొంత భవనం ఉండాలి..బడ్జెట్ ప్రతిపాదన లో వీటిని చేర్చాలి. కేంద్ర ప్రాయోజిత పథకాల పైన ప్రతి శాఖ దృష్టి పెట్టాలి..అధికారులు అప్రమత్తం గా ఉండాలి సర్వీస్ సెక్టార్ ను పూర్తి గా ప్రక్షాళన చేయాలి..ఆన్‌లైన్ విధానంలో అన్ని పనులు జరిగేలా చూడాలని సూచించారు. ఫైల్ విధానం ఉండాలి..నిర్ణీత సమయంలో ఫైల్ క్లియర్ కావాల్సిందే. వివిధ కంపెనీ లతో చేసుకున్న ఒప్పందాలు ,పెట్టుబడులు గ్రౌండ్ కావాలి..
పాత కాలం సర్వర్ లను అప్డేట్ చేసుకోవాలి.. సంక్షేమ పథకాలు పకడ్బందీగా అమలు చేయాలి..ఇందులో సాంకేతికత ను వినియోగించుకోవాలి నిజమైన లబ్దిదారులకు సంక్షేమ పథకాలు అందాలి. 30 వేల ఎకరాల్లో నిర్మిస్తున్న ఫ్యూచర్ సిటీ పైన దృష్టి పెట్టాలి..ఫ్యూచర్ సిటీ దేశ ఆర్థిక స్థితిని ని మార్చబోతోంది..మూసీ నది పరివాహక ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తున్నాం ..ఇక్కడ వచ్చే మార్పులను ప్రజలకు వివరించాలి.డిజిటల్ గవర్నెన్స్ పైన దృష్టి పెట్టాలి..నాణ్యమైన విద్య ను అందించడం పైన దృష్టి సారించాలి..వంద నియోజకవర్గాలలో తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ప్రారంభించుకోబోతున్నాం .. ప్ర భు త్వ విద్యను ప్రక్షాళన చేస్తాం..ప్రభుత్వ ఆస్పత్రులలో వైద్య సేవలు మెరుగుపడాలి..ప్రాంతాల వారీగా మెడికల్ డేటా తయారు చేయాలి.ప్రతి సెక్రటరీ తమ శాఖ లల్లో బెస్ట్ ప్రోగ్రామ్ ను డిజైన్ చేసుకోవాలి.. మార్చి 6 నుంచి 99 రోజుల ప్రణాళిక జూన్ 12 వరకు జరగబోతుంది.. జూన్ 2 వరకు ప్రతి ఆఫీస్ పరిశుభ్రంగా కావాల్సిందే..జూన్ 2 తెలంగాణ కు పండుగ..పండుగ ను అంతా ఘనంగా జరుపుకోవాలి.
మార్చి 6 నుంచి జూన్ 12 వరకు ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక కార్యక్రమం ప్రతి అధికారి ఈ కార్యక్రమం లో పాల్గొనాలి..మినహాయింపు లు ఉండవు శాఖ ల మధ్య సమన్వయం ఉండాలి.. ప్రతి ఎన్నికలో ప్రజలు నాకు కావాల్సిన బలాన్ని ఇచ్చారు..
ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మనం ప్రజలకు మంచి చేయాల్సి ఉందని సిఎం రేవంత్ సూచించారు.

# ఆయిల్ పామ్ సాగును లాభసాటిగా చేయడమే ప్రభుత్వ లక్ష్యం

మొదటి తరువాయి

ఆయిల్ పామ్ రైతులకు అధిక ధరలను అందించి ఆయిల్ పామ్ సాగును లాభ సాటిగా చేయటమే ప్రభుత్వ లక్ష్యం అని మంత్రి పేర్కొన్నారు. ఆయిల్ ఫెడ్ వారి ప్రోసెసింగ్ మిల్లులలో నూనె రికవరీ శాతం మరియు ముడి పామాయిల్ అమ్మకం ధరల ఆధారంగా ప్రతి నెల ఆయిల్ పామ్ గెలల ధర నిర్ణయించడం జరుగుతుంది. అయితే తెలంగాణ ఆయిల్ ఫెడ్ ద్వారా నడపబడుతున్న అప్పరావ్ పేట మరియు అశ్వరావుపేటలోని ఆయిల్ పామ్ కర్మాగారాలలో నూతన టెక్నాలజీతో కొత్త యంత్రాలు ఏర్పాటు చేయడం మరియు ఉన్న యంత్రాలను ఆధునికరించడం వల్ల ఆయిల్ పామ్ గెలల నుండి వచ్చే నూనె రికవరీ శాతం టన్నుకు 20.01 శాతముకు పెరగడం వల్ల టన్నుకు ఆయిల్ పామ్ గెలల ధర పెరుగుదలతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని మంత్రివర్యులు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో



నిర్ణయించబడిన ఆయిల్ పామ్ గెలల ధరను ఆంధ్రప్రదేశ్ లో కూడా ఇవ్వాల్సిరావడంతో అక్కడ పామ్ ఆయిల్ రైతులకు కూడా ప్రయోజనం చేకూరుతున్నదని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో 1992-93 నుంచి ఇప్పటి వరకు 2.90 లక్షల ఎకరాలను ఆయిల్ పామ్ సాగులోకి తీసుకురావడం జరిగిందని, ఈ ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి 1,07,400 ఎకరాలలో 33500 మంది రైతులు ఆయిల్ పామ్ సాగు చేపట్టరని 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఆయిల్ పామ్ సాగు కోసం 456 కోట్లు కేటాయించినట్లు మంత్రి పేర్కొన్నారు. వచ్చే సంవత్సరంలో మరో రెండు లక్షల ఎకరాలలో ఆయిల్ పామ్ సాగు చేపట్టేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతున్నదని పేర్కొన్నారు. ప్రస్తుతం 68,600 ఎకరాల నుండి ఆయిల్ పామ్ గెలల ఉత్పత్తి జరుగుతున్నదని అన్నారు. రైతులను ఆయిల్ పామ్ సాగు వైపు ప్రోత్సహించేందుకు ఏకరాకు రూ 50918/- రాయితిని నాలుగు సంవత్సరాల కాలానికి ఇవ్వడం జరుగుతున్నదని, దీర్ఘకాలిక లాభాల నుండి ఆయిల్ పామ్ సాగు కోసం రైతులు పెద్ద ఎత్తున ఆయిల్ పామ్ సాగు చేయడానికి ముందుకు రావాలని మంత్రి కోరారు.

# టీ20 వరల్డ్‌కప్ నుంచి పాకిస్తాన్ ఎలిమినేట్..

మొదటి తరువాయి

వికెట్‌కు 176 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. షాహిబ్‌జాదా ఫర్హాన్ సెంచరీ చేయడంతో పాక్ 250 వరకు పరుగులు చేస్తుందని అందరూ అనుకున్నారు. ఫఖర్ జమాన్ అవుటైన తర్వాత పాక్ వెంటవెంటనే వికెట్లు కోల్పోవడంతో 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 212 పరుగులు మాత్రమే చేయగలిగింది.పాక్ నిర్దేశించిన 213 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన శ్రీలంక జట్టు మ్యాచ్ ఓడిపోయినప్పటికీ దీటుగా ఆడి పాకిస్తాన్‌ను టీ20 వరల్డ్‌కప్ నుంచి నిష్క్రమించేలా చేసింది. ఈ మ్యాచ్‌లో శ్రీలంకను 147 పరుగుల లోపు కట్టడి చేస్తేనే పాక్ సెమీ ఫైనల్‌కు అర్హత సాధించేది. కానీ పవన్ రత్నాయకే అటాకింగ్ బ్యాటింగ్‌తో హాఫ్ సెంచరీ చేసి పాక్ సెమీస్ ఆశలపై నీళ్లు చల్లాడు. ఆఖర్లో దాసున్ శనక సిక్సర్లతో విధ్వంసం సృష్టించాడు. ఆల్‌మోస్ట్ శ్రీలంక గెలిచిందని అందరూ అనుకున్నారు. లంక 20 ఓవర్లలో 207/6 పరుగులు చేయడంతో 6 పరుగుల తేడాతో




ఓటమిపాలయ్యింది. భారీ టార్గెట్‌తో బరిలోకి దిగిన లంక ఆరంభంలోనే పాతుమ్ నిస్సంక వికెట్ కోల్పోయింది. నిస్సంక అవుటైనా మరో ఓపెనర్ కమిల్ మిషారా మాత్రం అద్భుతంగా ఆడాడు. అయితే, అబ్రార్ అహ్మద్ వేసిన స్టన్నింగ్ బంతికి పవర్ ప్లే లోనే వికెట్ కోల్పోయాడు. 15 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్సర్‌తో 26 పరుగులు చేసి అవుటయ్యాడు. దాంతో 33 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయింది.చరితా అసలంక 18 బంతుల్లో 1 ఫోర్లు, రెండు సిక్సర్లతో 25 పరుగులు చేసి అవుటయ్యాడు. అసలంక అవుటైన తర్వాత కమిందు మెండిస్, జనిత్ లియానగే వెంటవెంటనే వికెట్లు కోల్పోయింది. దాంతో శ్రీలంక 101 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయింది. దాంతో అందర్నీలో టెన్షన్ మొదలైనా.. పవన్ రత్నాయకే కెప్టెన్ దాసున్ శనకతో కలిసి ఇన్నింగ్స్‌ను ముందుకు తీసుకెళ్లాడు. దాంతో పాకిస్తాన్ 147 పరుగులలోపే శ్రీలంకను కట్టడి చేయలేకపోయింది. పవన్ రత్నాయకే 37 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సర్లతో 58 పరుగులు చేసి అవుటయ్యాడు. దాసున్ శనక కెప్టెన్ ఇన్నింగ్స్‌తో కేవలం 31 బంతుల్లో 2 ఫోర్లు, 8 సిక్సర్లతో 76 పరుగులతో విధ్వంసం సృష్టించాడు. దాంతో శ్రీలంక జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 207 పరుగులు చేసింది. ఈ మ్యాచ్‌లో శ్రీలంక కేవలం 6 పరుగుల తేడాతోనే ఓటమిపాలయింది. ఈ మ్యాచ్‌లో పాక్ గెలిచినప్పటికీ నెట్ రన్‌రేట్ అధికంగా ఉన్న న్యూజిలాండ్ జట్టు సెమీఫైనల్‌లో అడుగుపెట్టింది.

# డూ ఆర్ డై మ్యాచ్‌కు సిద్ధమైన టీమిండియా

మొదటి తరువాయి

ఇరు జట్లు గెలుపే లక్ష్యంగా సిద్ధమవుతున్నాయి.గత టీ20 ప్రపంచకప్ 2024 తర్వాత ఇరు జట్లు ఒక్కసారి కూడా తలపడలేదు. ద్వైపాక్షిక టీ20 సిరీస్‌లో టీమిండియాను చివరిసారిగా ఓడించిన ఏకైక జట్టు కూడా వెస్టిండీస్. 2023 ఆగస్టులో భారత్‌పై విండీస్ టీ20 సిరీస్ గెలిచింది. అనంతరం భారత్ ఒక్క సిరీస్ కూడా కోల్పోలేదు. గత మూడేళ్లుగా ఇరు జట్లలో చాలా మార్పులు జరిగాయి. భారత్ బలం రెట్టింపు అవ్వగా.. వెస్టిండీస్ కూడా పటిష్టంగా మారింది. ఈ మెగా టోర్నీలో అత్యధిక సిక్స్‌లు కొట్టిన జట్టుగా వెస్టిండీస్ ఉంటే.. ఆ జట్టు కంటే 3 సిక్స్‌ల తక్కువతో రెండో స్థానంలో టీమిండియా ఉంది.అయితే బలబలాల పరంగా టీమిండియానే హాట్ ఫేవరేట్‌గా బరిలోకి దిగుతోంది. విండీస్ కంటే భారత బౌలింగ్ విభాగం బలంగా ఉంది. మిస్టరీ స్పిన్‌తో పాటు వరల్డ్ క్లాస్ పేస్ బౌలర్లు ఉన్నారు. అయితే తమదైన రోజున విండీస్ ఆపడం ఎంత పెద్ద



జట్టుకైనా కష్టం.ఈ కీలక పోరుకు టీమిండియా ఎలాంటి మార్పులు లేకుండా బరిలోకి దిగే అవకాశం ఉంది. ప్రత్యర్థి జట్ల ఆఫ్ స్పిన్ మంత్రానికి చెక్ పెట్టేందుకు సంజూ శాంసన్ బరిలోకి దించుతూ టీమిండియా మేనేజ్‌మెంట్ రచించిన వ్యూహం ఫలించింది. దాంతో సంజూ, అభిషేక్ శర్మనే ఓపెనర్లుగా కొనసాగనున్నారు. ఇషాన్ కిషన్ ఫస్ట్ డౌన్‌లో ఆడనుండగా.. సూర్యకుమార్ యాదవ్, హార్దిక్ పాండ్యా, తిలక్ వర్మ మిడిలార్డర్‌లో ఆడనున్నారు. జింబాబ్వే మ్యాచ్ తరహాలో టాప్-6 బ్యాటర్లు చెలరేగితే.. టీమిండియాకు తిరుగుండదు. శివమ్ దూబె, అక్షర్ పటేల్ లోయరార్డర్‌లో ఆడనున్నారు. బౌలింగ్‌లో విఫలమవుతున్న శివమ్ దూబేను తప్పించాలనుకుంటే రింకూ సింగ్ తుది జట్టులోకి వస్తాడు. కానీ ఈ సాహసం టీమిండియా చేయకపోవచ్చు.ఇక బౌలింగ్‌లో బుమ్రా సూపర్ ఫామ్ భారత్‌కు కలిసొచ్చే అంశం. అతనితో పాటు అర్ష్‌దీప్ సింగ్, హార్దిక్ పాండ్యా, వరుణ్ చక్రవర్తి, అక్షర్ పటేల్‌తో కూడిన భారత బౌలింగ్ దాడిని ఎదుర్కోవడం వెస్టిండీస్‌కు పెద్ద సవాలే. మిగతా కాంబినేషన్‌లో పెద్దగా మార్పులు జరిగే అవకాశం లేదు. కుల్దీప్ యాదవ్, మహమ్మద్ సిరాజ్, వాషింగ్టన్ సుందర్, రింకూ సింగ్ బెంచ్‌కే పరిమితం కానున్నారు.

# పేద వీధి వ్యాపారులకు గొడుగుల పంపిణీ



**కరీంనగర్, ఫిబ్రవరి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ నగరంలోని పలు వీధుల్లో వ్యాపారం చేసే పేదలకు మానేరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గొడుగులను పంపిణీ చేశారు. విద్యానగర్లో ఒక మహిళకు, అంబేద్కర్ స్టేడియం ముందు ఒక నిరుపేద కుటుంబానికి, గాంధీ రోడ్డులో చెరుకు బండి నడిపే వ్యక్తికి మూడు గొడుగులను అందజేశారు. ఎండాకాలం సమీపిస్తున్న దృష్ట్యా పేదలకు గొడుగులు అందించడం ద్వారా వారికి ఉపశమనం కలుగుతుందని, ఎండదెబ్బ తగలకుండా ఉపయోగపడతాయని మానేరు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ముత్యం శంకర్ తెలిపారు. రానున్న రోజుల్లో ఇంకా పేదలకు సహాయం అందించేందుకు లయన్స్ క్లబ్ కృషి చేస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సెక్రటరీ జిల్లా కృష్ణ, ట్రెజరర్ సంద రాజశేఖర్, మాజీ జోన్ చైర్మన్ వేముల విష్ణుమూర్తి పాల్గొన్నారు.

## కవితకు న్యాయస్థానం క్లీన్‌చిట్ ఇవ్వడంతో రాష్ట్రవ్యాప్తంగా సంబరాలు



**కరీంనగర్, ఫిబ్రవరి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవితకు న్యాయస్థానం క్లీన్‌చిట్ ఇవ్వడంతో రాష్ట్రవ్యాప్తంగా సంబరాలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా జాగృతి జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ మాట్లాడుతూ, బీఆర్ఎస్ పార్టీ ఓటమికి కేటీఆర్, హరీష్ రావుల అహంకారమే కారణమని తీవ్ర విమర్శలు చేశారు. కార్యకర్తలను, ఉద్యమకారులను నిర్లక్ష్యం చేసి, పైరవీకారులను, కబ్జాకోరులను మాత్రమే పక్కన పెట్టుకోవడం వల్లే పార్టీ ఓటమి చవిచూసిందని ఆయన అన్నారు. కవితపై అక్రమంగా పెట్టిన కేసు కారణంగా ఓడిపోయామని చెప్పడం దివాలాకోరుతనమని ఖండించారు. హైదరాబాద్‌లో జరిగిన సమీక్ష సమావేశంలో కూడా నాయకులు, కార్యకర్తలు కేటీఆర్, హరీష్ రావుల ముఖం మీదనే మీ కారణంగా ఓడిపోయామని స్పష్టంగా చెప్పారని హరిప్రసాద్ తెలిపారు. కవితను పార్టీ నుండి బహిష్కరించినా, తెలంగాణ ప్రజలు ఆమెను అక్కున చేర్చుకొని భవిష్యత్ నాయకురాలిగా బలపరుస్తున్నారు అని ఆయన పేర్కొన్నారు.

# ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఘనంగా సైన్స్ డే



**కరీంనగర్, ఫిబ్రవరి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
స్థానిక పిఎం శ్రీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సైన్స్‌పై టెస్ట్, ఉపన్యాసం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు ఎం. శ్రీనివాస్ మాట్లాడుతూ, సైన్స్ దినదిన అభివృద్ధి చెందుతూ మానవాళిని ఉన్నత స్థితికి చేర్చిందని వివరించారు. సైన్స్ రాజేష్ మాట్లాడుతూ, విద్యార్థులు ఇప్పటి నుంచే విజ్ఞానంపై మక్కువ పెంచుకొని భవిష్యత్తులో శాస్త్రవేత్తలుగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె. అనిల్, ఏ. ప్రవీణ్, ఆర్. సవేరా, సమత, ఛాత్రోపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## వాహనాలు నడిపే డ్రైవర్లకు కంటిచూపే అత్యంత కీలకం జిల్లా ఎస్పీ డా. శబరీష్



**కేసముద్రం, ఫిబ్రవరి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వాహనాలను నడిపే ప్రతి డ్రైవర్‌కు స్పష్టమైన కంటిచూపు అత్యంత అవసరమని, కంటి చూపు లోపాలు రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణమని జిల్లా ఎస్పీ డా. శబరీష్, ఐపీఎస్ పేర్కొన్నారు. శనివారం కేసముద్రం మండల కేంద్రంలోని హరిహర గార్డెన్‌లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో "అరైవ్ అలైవ్" కార్యక్రమం భాగంగా అగర్వాల్ హాస్పిటల్ సౌజన్యంతో లారీ, ఆటో, డీసీఎం, గ్రామపంచాయతీ ట్రాక్టర్ డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షా శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఎస్పీ డా. శబరీష్ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "డ్రైవర్లు తరచుగా కంటి పరీక్షలు చేయించుకోవాలి. సమస్యలను ముందుగానే గుర్తించి తగిన చికిత్స తీసుకోవాలి. ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలి. మద్యం సేవించి వాహనాలు నడపకూడదు. అధిక వేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్, ర్యాష్ డ్రైవింగ్‌ను పూర్తిగా నివారించాలి. వాహనాలలో అధిక లోడ్‌తో ప్రయాణించడం ప్రమాదాలకు దారితీస్తుంది. లారీ డ్రైవర్లు, ఎక్కువ దూరం ప్రయాణించే వారు నిద్రమత్తు వచ్చినప్పుడు వాహనాన్ని సురక్షిత ప్రదేశంలో ఆపి విశ్రాంతి తీసుకోవాలి. అలసటతో వాహనం నడపడం తీవ్రమైన ప్రమాదాలకు కారణమవుతుంది. ప్రతి డ్రైవర్ బాధ్యతాయుతంగా వ్యవహరిస్తే రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చు" అని సూచించారు. అనంతరం జర్నలిస్టులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తూ హెల్మెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ అడ్మిన్ గంద్రతి మోహన్, కేసముద్రం సీఐ సత్యనారాయణ, ఎస్ఐలు క్రాంతి కిరణ్, రమేష్ బాబు, కరుణాకర్, నరేష్, పోలీస్ సిబ్బంది, డా. అగర్వాల్ హాస్పిటల్ వైద్య సిబ్బంది, డ్రైవర్లు పాల్గొన్నారు.

# గాయత్రి డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో జాతీయ విజ్ఞాన దినోత్సవం



**పెద్దపల్లి, ఫిబ్రవరి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని గాయత్రి డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్ సి.వి. రామన్ చిత్రపటానికి పూలమాల వేసి సైన్స్ ఎక్స్పోను ప్రారంభించారు. ఎక్స్పోలో భాగంగా విద్యార్థులు డిఎన్ఏ ఎక్స్ట్రాక్షన్, బ్లడ్ గ్రూప్ టెస్ట్, లంగ్స్ మోడల్, ప్యూరిఫికేషన్ ఆఫ్ ఎయిర్, వాటర్ సైకిల్, ఫోటోసింథసిస్ వంటి 29 రకాల విజ్ఞాన ప్రదర్శనలు చేశారు. ఈ సందర్భంగా అల్లెంకి శ్రీనివాస్ మాట్లాడుతూ, సి.వి. రామన్ కనుగొన్న రామన్ ఎఫెక్ట్ రోజునే విజ్ఞాన దినోత్సవం జరుపుకుంటాం. 1930లో భౌతిక శాస్త్రంలో ఆసియా ఖండంలో నోబెల్ బహుమతి పొందిన తొలి వ్యక్తి మన భారతీయుడు కావడం గర్వకారణం అని తెలిపారు. విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనలు, సృజనాత్మకత పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన సైన్స్ నమూనాలను పరిశీలించి, బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ జే. రవీందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రోడ్డు పనులు నిలిచిపోవడంపై బీజేపీ ఆగ్రహం



**పెద్దపల్లి, ఫిబ్రవరి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జూలపల్లి మండలంలో రోడ్డు నిర్మాణ పనులు సంవత్సరాలుగా నిలిచిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు అమరగాని ప్రదీప్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. జూలపల్లి నుండి పెద్దపల్లి వెళ్లే ప్రధాన రోడ్డు, మండల కేంద్రంలోని మెయిన్ రోడ్డు పనులు ఎక్కడికక్కడ ఆగిపోవడంతో ప్రజలు నరకం చూస్తున్నారని ఆయన విలేకరులతో అన్నారు. పోలీస్ స్టేషన్ చౌరస్తా, జూపిటర్ స్కూల్ ముందు, బస్టాండ్ ప్రాంతంలో తవ్విన రోడ్లను కంకర వేసి వదిలేయడంతో దుమ్ము దూళి కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రజలు అభివృద్ధి కోసం తమ నిర్మాణాలను స్వచ్ఛందంగా కూల్చివేసినా పనులు పూర్తి చేయకపోవడం పాలకవర్గ నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆయన విమర్శించారు. వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి శిలాఫలకం వేసి ఆ ఊసే మర్చిపోయారని, కాచాపూర్‌పెద్దపల్లి డబుల్ రోడ్డు పనులు కూడా ఇష్టారీతిన సాగుతున్నాయని వాపోయారు. జూలపల్లి ప్రజలకు ఇచ్చిన రాజకీయ భిక్షను గుర్తుంచుకుని ఎమ్మెల్యే విజయరమణారావు వెంటనే పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. వారం రోజుల్లో పనులు పూర్తి చేయకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## మేయర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన బీజేపీ నాయకులు



**కరీంనగర్, ఫిబ్రవరి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: కరీంనగర్ నగరపాలక సంస్థ మేయర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కొలగాని శ్రీనివాస్‌ను బీజేపీ నాయకులు మేయర్ చాంబర్లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్వామి వివేకానంద చిత్రపటాన్ని అందజేశారు. బీజేపీ పశ్చిమ జోన్ మాజీ అధ్యక్షుడు నరహరి లక్ష్మారెడ్డి, పశ్చిమ జోన్ కన్వీనర్ జాడి బాల్ రెడ్డి, నాయకులు గాజ శివరాం, దయ్యాల మల్లేశం, కొత్తపల్లి శంకరయ్య ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాల్ రెడ్డి, లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, దశాబ్ద కాలంగా బీజేపీ కార్యకర్తలు కన్న కల సాకారం అయిందని, తమ పదవీకాలంలో కరీంనగర్ నగరాన్ని సుందరీకరణ నగరంగా తీర్చిదిద్దాలని మేయర్‌ను కోరారు.

# మహిళలు సైన్స్ పరిశోధనల్లో ముందుండాలి

**- కెప్టెన్ డా. బి. మధుసూదన్**



**కరీంనగర్, ఫిబ్రవరి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని పురస్కరించుకొని కరీంనగర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో భౌతిక, రసాయనశాస్త్ర విభాగాలు సంయుక్తంగా కార్యక్రమం నిర్వహించాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న కెప్టెన్ డా. బి. మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ, గత అర్థ శతాబ్దంలో మహిళలు శాస్త్ర పరిశోధన రంగంలో వెనుకబడి ఉన్నారని, అందుకే ఈ సంవత్సరం వికసిత భారత్ లక్ష్యంగా సైన్స్‌లో మహిళలు అనే అంశాన్ని కేంద్ర ప్రభుత్వం ఎంచుకుందని తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉన్న ఈ కాలంలో శాస్త్ర పరిశోధనల్లో కూడా చురుకుగా పాల్గొని ప్రపంచ సమస్యల పరిష్కారానికి తోడ్పడాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డి. వరలక్ష్మి మాట్లాడుతూ, సి.వి. రామన్ శాస్త్ర సాంకేతిక రంగంలో చేసిన కృషిని గుర్తుచేసి, రాబోయే దశాబ్దాన్ని మహిళా శాస్త్ర పరిశోధన దశాబ్దంగా నిలపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అదేవిధంగా, మహిళా సాధికారత సెల్ ఆధ్వర్యంలో, లయన్స్ ఇంటర్నేషనల్ కరీంనగర్ సహకారంతో బ్యూటిషన్ సర్టిఫికేట్ కోర్స్ ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని కోఆర్డినేటర్ డా. బి. రజినీ దేవి ఘనంగా ప్రారంభించారు. విద్యార్థులకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడం, వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించడం ఈ కోర్సు ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమానికి లయన్స్ క్లబ్ గవర్నర్ లయన్ సింహరాజు కొండారం, జిల్లా కేబినెట్ కార్యదర్శి లయన్ సింగిరెడ్డి వాసుదేవరెడ్డి, రీజన్ చైర్‌పర్సన్ లయన్ బోయినపల్లి సరళ, జోన్ చైర్‌పర్సన్ లయన్ బుర్ల అనురాధ, లయన్ రాజేంద్రప్రసాద్ తదితరులు హాజరయ్యారు.

# వెలిచాల రాజేందర్‌రావును అభినందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**కరీంనగర్, ఫిబ్రవరి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయం సాధించేందుకు విశేష కృషి చేసిన అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. శనివారం హైదరాబాదులో ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన రాజేందర్‌రావు, ఎన్నికల ప్రచారం తీరు, ప్రత్యేక ప్రణాళికలు, ఫలితాలు, కాంగ్రెస్ పార్టీ గ్రాఫ్ పెరగడం, 0 నుండి 14 సీట్ల వరకు ఎదగడం వంటి అంశాలపై చర్చించారు. అన్ని విషయాలను ముఖ్యమంత్రి ఓపిగ్గా విని, రాజేందర్‌రావుకు సూచనలు అందించారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ, రాజేందర్ అన్నా, మీరు చాలా బాగా పనిచేశారు. ప్రజల్లో మీపై మంచి అభిప్రాయం ఉంది. పార్టీ గ్రాఫ్ పెంచారు. పట్టుదలతో పని చేస్తూ మొక్కవోని ధైర్యంతో ముందుకు సాగండి అని వెన్ను తట్టి ప్రోత్సహించారు. ఎమ్మెల్యే ఎన్నికల వరకు ప్రజల్లోనే ఉండి పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. కరీంనగర్ అభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేస్తానని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి, త్వరలోనే ఎన్నికైన కార్పొరేటర్లను కలుస్తానని, కరీంనగర్ ప్రజలకు అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలను బహిరంగ సభలో ప్రకటిస్తానని తెలిపారు. రాజేందర్‌రావు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ప్రత్యేకంగా వెన్ను తట్టి అభినందించడం మరిచిపోలేనిదని, రెట్టింపు ఉత్సాహంతో ముందుకు సాగి కరీంనగర్ గడ్డను కాంగ్రెస్ అడ్డాగా మార్చేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

# పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత

- మేయర్ శ్రీనివాస్



**కరీంనగర్, ఫిబ్రవరి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

హమ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో తీగలగుట్టపల్లిలోని మేయర్ క్యాంప్ కార్యాలయంలో పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత ప్లాస్టిక్ సంచులను నిషేధిద్దాం, పర్యావరణాన్ని రక్షిద్దాం అనే నినాదంతో ముద్రించిన వాల్ పోస్టర్‌ను మేయర్ కోలగాని శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత అని గుర్తుచేసి, పరిశుభ్రతతోనే ఆరోగ్యం సాధ్యమవుతుందని తెలిపారు. ప్లాస్టిక్ సంచులను వాడకుండా బట్ట సంచులను వినియోగించాలని సూచించారు. సంస్థ వ్యవస్థాపకుడు ధనపురి సాగర్ మాట్లాడుతూ, ప్లాస్టిక్ సంచులను నిర్మూలించడంలో మేయర్ కీలక పాత్ర పోషించాలని కోరగా, మేయర్ సానుకూలంగా స్పందించి, కార్పొరేషన్ పరిధిలో ప్లాస్టిక్ సంచులను పూర్తిగా నిర్మూలించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మేయర్‌ను శాల్వతో సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు డాక్టర్ గుండా శ్రీనివాస్, టి. తిరుపతి, ఎం. శేఖర్, ఎం. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# 50వ డివిజన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానన్న కార్పొరేటర్ ప్రవీణ్



**కరీంనగర్, ఫిబ్రవరి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

కరీంనగర్ నగరపాలక సంస్థలో 50వ డివిజన్‌ను క్లీన్ డివిజన్‌గా మార్చి ఆదర్శవంతమైన డివిజన్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని కార్పొరేటర్, పార్లమెంటు కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్ కుమార్ తెలిపారు. చెత్త సేకరణ కోసం డివిజన్‌కు కొత్త ట్రాక్టర్ కేటాయించిన సందర్భంగా శనివారం వాహనాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ, పారిశుధ్య పనులు నిరంతరం సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా అందించాలని ప్రజలను కోరారు. రోడ్లపై చెత్త వేయకుండా మున్సిపల్ సిబ్బందికి అందజేయాలని సూచించారు. ప్రజల సహకారంతోనే డివిజన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దగలమని, అందరి భాగస్వామ్యంతో అభివృద్ధి పనులు కొనసాగిస్తానని ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు.

# మంత్రి బండి సంజయ్‌పై మండిపడ్డ బీఆర్ఎస్ నాయకులు




**కరీంనగర్, ఫిబ్రవరి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

కరీంనగర్ బీఆర్ఎస్ పార్టీ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ ఆధ్వర్యంలో జరిగిన పత్రికా సమావేశంలో కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌పై తీవ్ర విమర్శలు చేశారు. ధర్మం పేరుతో రెండు సార్లు ఎంపీగా గెలిచి కేంద్రమంత్రి అయ్యి ఇప్పుడు అబద్ధాలు చెబుతూ ధర్మం తప్పుతున్నారని ఆయన ఎద్దేవా చేశారు. రెబల్‌గా పోటీ చేస్తే 15 ఏళ్లు సస్పెండ్ చేస్తామని చెప్పిన బండి సంజయ్, అదే ధర్మం పేరుతో రెబల్స్‌ను బీజేపీలో చేర్చుకోవడం ఏ విధమైన న్యాయం అని ప్రశ్నించారు. మహిళ ఓట్లతో బీజేపీ 30 సీట్లు గెలిచినా, డిప్యూటీ మేయర్ పదవి మహిళలకు ఇవ్వకుండా ధర్మం తప్పారని, మహిళా లోకానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బీజేపీ నుంచి గెలిచిన 19 మంది మహిళా కార్పొరేటర్లలో ఎవ్వరూ అర్హులు కాదా అని ప్రశ్నించారు. మాజీ మేయర్ సునీల్‌రావును అవినీతిపరుడని విమర్శించిన బండి సంజయ్, అదే వ్యక్తిని డిప్యూటీ మేయర్‌గా నియమించడం ధర్మం తప్పినట్టే అని హరిశంకర్ మండిపడ్డారు. గతంలో బీఆర్ఎస్ హయంలో 51వ డివిజన్‌లో 16 లక్షలతో మంజూరైన పనిని తన ఘనతగా చెప్పుకోవడం సిగ్గు చేటు అని అన్నారు. కేంద్రం నుండి నిధులు తెచ్చే శక్తి ఉంటే తన ఇంటి చుట్టూ వేసిన రోడ్లన్నీ మున్సిపల్ జనరల్ ఫండ్‌తో ఎందుకు వేసారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అబద్ధాలతో బీజేపీ 30 సీట్లు గెలిచిందని, ధర్మం తప్పిన బండి సంజయ్‌ను ఆయన నమ్మే అమ్మవారు కూడా క్షమించరని వ్యాఖ్యానించారు. కరీంనగర్ కార్పొరేషన్ అభివృద్ధి కోసం పార్టీలకతీతంగా 66 మంది కార్పొరేటర్లను సీఎం వద్దకు తీసుకెళ్లాలని, నమ్మకద్రోహానికి కేరాఫ్ అడ్రస్ డిప్యూటీ మేయర్ సునీల్‌రావు అని, అతని పట్ల జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. ఈ సమావేశంలో మాజీ కార్పొరేటర్ అనూప్, బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు ఆరే రవి గౌడ్, చేతి చంద్రశేఖర్, బండ శ్రీకాంత్, తొంటి రాజేందర్, ఎడబోయిన శ్రీనివాసరెడ్డి, హనుమల్ల ఉమాశంకర్, యూత్ నాయకులు సత్తినేని శ్రీనివాస్‌తో పాటు పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎస్ఆర్ఆర్ డిగ్రీ కళాశాల కెరీర్ కోషంట్ కంపెనీ అవగాహన ఒప్పందం

**కరీంనగర్, ఫిబ్రవరి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

స్థానిక ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్), కరీంనగర్ మరియు కెరీర్ కోషంట్ కంపెనీ మధ్య విద్యార్థుల నైపుణ్యాభివృద్ధి, శిక్షణ, ఉపాధి అవకాశాల పెంపు లక్ష్యంగా పరస్పర అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ప్రకారం విద్యార్థుల కోసం ఇన్ఫోసిస్ ఫ్రీ ట్రైనింగ్ & ప్లేస్మెంట్ ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా స్వల్పకాలిక నైపుణ్యాభివృద్ధి కోర్సులు, శిక్షణా కార్యక్రమాలు, ఉపాధి మార్గదర్శక సేవలను అందించేందుకు రెండు సంస్థలు కలిసి పనిచేయనున్నాయి. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. రామకృష్ణ మాట్లాడుతూ, ఈ ఒప్పందం ద్వారా విద్యార్థులకు ప్రముఖ ఐటీ సంస్థల సర్టిఫికేషన్ ప్రోగ్రామ్స్, ఆధునిక సాంకేతిక రంగాల్లో శిక్షణ, మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ముఖ్యంగా ఇన్ఫోసిస్, ఐబీయం సర్టిఫికేషన్ కోర్సులు, కృత్రిమ మేధస్సు, రోబోటిక్స్ రంగాల్లో ఉన్న అవకాశాలపై అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. ఇన్ఫోసిస్ శిక్షకుడు పి. అశోక్ మాట్లాడుతూ, ఉచిత శిక్షణా కార్యక్రమాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఆధునిక సాంకేతిక రంగాల్లో తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. ప్రపంచవ్యాప్తంగా ఏఐ, రోబోటిక్స్ రంగాల్లో విస్తృత అవకాశాలు ఉన్నాయని, సరైన శిక్షణతో విద్యార్థులు గ్లోబల్ స్థాయిలో పోటీ చేయగలరని అన్నారు. కార్యక్రమంలో కెరీర్ కోషంట్ ట్రైనర్ తాళ్లపల్లి అశోక్, టిఎస్కేసి సమన్వయకర్త డా. బి. సతీష్ కుమార్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డా. హర్ జ్యోతి కౌర్, కెరీర్ గైడెన్స్ కోఆర్డినేటర్ కే. సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. 3

# కార్పొరేటర్ అక్రమాలపై బండి సంజయ్‌కు బహిరంగ లేఖ



**కరీంనగర్, ఫిబ్రవరి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల సందర్భంగా బీజేపీ పార్టీకి మేయర్ పదవి ఇస్తే కేంద్రం నుండి ప్రత్యేక నిధులు తెచ్చి అవినీతి, అక్రమాలకు తావు లేకుండా సుపరిపాలన అందిస్తానని హామీ ఇచ్చిన కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌కు మాజీ కార్పొరేటర్, న్యాయవాది ఎ.వి. రమణ బహిరంగ లేఖ రాశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అక్రమార్కులు బండి సంజయ్ చుట్టూ ఉన్నారని ఆరోపించారు. ఉదాహరణగా 12వ డివిజన్ కార్పొరేటర్ చొప్పరి జయశ్రీ భర్త చొప్పరి వేణు 20 ఫీట్ల రోడ్డును ఆక్రమించి, ఇంటి నెంబర్ పొంది, ఆ డాక్యుమెంట్ ఆధారంగా శ్రీరామ్ ఫైనాన్స్‌లో లోన్ పొందారని ఆధారాలతో లేఖలో పేర్కొన్నారు. కేంద్ర మంత్రి తన హామీలు నీటి మీద రాతలు కాకపోతే వెంటనే వారి పై చర్యలు తీసుకోవాలని, కార్పొరేటర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాంచంద్రాపూర్ కాలనీలో ఖాళీ స్థలాలను ఆక్రమించి విక్రయించడం, అక్రమ డబ్బును ఎన్నికల్లో వెదజల్లడం ఆనవాయితీగా వస్తోందని ఆరోపించారు. అధికారులు ఈ ప్రాంతంలో కేటాయించిన ఇంటి నంబర్లపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని రమణ కోరారు. లేనిపక్షంలో ప్రజలతో కలిసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ధీరజ్, శ్రీనివాస్ రావు, శంకర్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# తిరుమల నగర్ రోడ్డు పనులు నిలిపివేయడంపై సిపిఐ ఆగ్రహం



**కరీంనగర్, ఫిబ్రవరి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

కరీంనగర్ నగరంలోని 40వ డివిజన్ తిరుమల నగర్ నుండి కట్ట రాంపూర్, హనుమాన్ నగర్ వెళ్లే రహదారి సంవత్సరాలుగా తవ్వి వదిలేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు పైడిపల్లి రాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ అధికారులు, ప్రజా ప్రతినిధులు నిర్లక్ష్యం వహించడం వల్ల వాహనదారులు, పాదాచారులు ప్రమాదాలకు గురవుతున్నారని ఆయన విమర్శించారు. స్మార్ట్ సిటీ నిధులు వందల కోట్లు ఇచ్చామని చెప్పి కాలయాపన చేయడం, రోడ్డు పనులను పూర్తి చేయకపోవడం ప్రజలతో మోసం చేయడమేనని అన్నారు. నూతనంగా ఎన్నికైన మేయర్ పెండింగ్‌లో ఉన్న రహదారి పనులకు నిధులు కేటాయించి వెంటనే ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు. తిరుమల నగర్ రోడ్డు పనులు ఏండ్లుగా నిలిచిపోయి ప్రజలు నరకం చూస్తున్నారని, దీనిపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపి అవినీతికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. లేనిపక్షంలో ప్రజలతో కలిసి మున్సిపల్ కార్యాలయం ముందు ఆందోళన చేపడతామని పైడిపల్లి రాజు హెచ్చరించారు.

# విద్యా కమిషన్ రిపోర్టును వ్యతిరేకించిన ఉపాధ్యాయులు



**హుస్నాబాద్, ఫిబ్రవరి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** హుస్నాబాద్ మండలం మహ్మదాపూర్ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఉపాధ్యాయుల పట్ల సమాజంలో చులకన భావన కలిగించేలా ప్రభుత్వానికి విద్యా కమిషన్ రిపోర్ట్ అందించడాన్ని వారు తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ, రిపోర్ట్ తయారు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఉపాధ్యాయులను కించపరిచిన అంశాలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పిఆర్‌టియు మండల అధ్యక్షుడు కొలుగూరి తిరుపతిరెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడు లింగారెడ్డి, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు మహేందర్, తిరుపతి, వేణుగోపాల్ రెడ్డి, శ్రీనివాస్, రమాదేవి, కిషన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా తెలంగాణ లేబర్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు




**కరీంనగర్, ఫిబ్రవరి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** కరీంనగర్ గణాంక భవనంలో తెలంగాణ లేబర్ యూనియన్ ఏడవ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు కుతాడి శివరాజ్ మాట్లాడుతూ, రాష్ట్రంలో కార్మిక చట్టాలు అమలు కావడం లేదని, వలస కార్మికులు, మహిళా కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు శ్రమదోపిడికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న లేబర్ కోడ్స్ కార్మిక ఉద్యమానికి ముక్కుతాడు వేయడానికి ప్రయత్నిస్తున్నాయని మండిపడ్డారు. కార్మిక చట్టాలు అమలు అయ్యేదాకా పోరాటం కొనసాగించాలి. వలస కార్మికులకు భద్రతా చట్టం, మహిళా కార్మికులకు రక్షణ, స్థానిక కార్మికులకు ఉపాధి, సంక్షేమ పథకాలు అందించాలి అని ఆయన డిమాండ్ చేశారు. కార్మికులందరూ ఐక్యంగా ఉండి తమ హక్కులను కాపాడుకోవాలని, తెలంగాణ లేబర్ యూనియన్ ఎల్లప్పుడూ కార్మికుల అండగా ఉంటుందని శివరాజ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారుకురి శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మొగురం మీరియా, జిల్లా అధ్యక్షుడు కాశిపాక అజయ్, నాయకులు గందే కొమురయ్య ముదిరాజ్, బొంకూరి కల్పన, సి. హెచ్. లలిత, పెద్దల్లి చంద్రకాంత్ యాదవ్, కన్నం లక్ష్మణ్, వినోద్ కుమార్, అశోక్ తదితరులు పాల్గొన్నారు. సుమారు 200 మంది కార్మికులు హాజరయ్యారు.

## ఎం.కె.ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా 'జాతీయ సైన్స్ దినోత్సవం'



**దేవరకొండ ఫిబ్రవరి 28. (నీలగిరి ఎక్స్ ప్రెస్).** దేవరకొండ పట్టణం లోని స్థానిక ఎం కె ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అటానమస్ లో భౌతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవం కార్యక్రమము కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపల్ జి కోటయ్య అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని సైన్స్ యొక్క ఆవశ్యకతను తెలియజేశారు. అనంతరం భౌతికశాస్త్ర అధ్యాపకులు కళాశాల సీఓఈ జి లింగారెడ్డి మాట్లాడుతూ, సీవీ రామన్ గురించి ఆయన చేసిన పరిశోధన రామన్ ఎఫెక్ట్ గురించి విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అకాడమీ కోఆర్డినేటర్ సిహెచ్ లింగమయ్య, చరిత్ర అధ్యాపకులు డాక్టర్ కే రేణుక, కంప్యూటర్ అధ్యాపకులు నర్మదా దేవి,జువాలజీ అధ్యాపకులు వెంకటేష్ తదితర కళాశాల సిబ్బందితోపాటు విద్యార్థిని విద్యార్థులు పాల్గొని విజయవంతం చేశారు. అనంతరం విద్యార్థులకు సైన్స్ క్విజ్ నిర్వహించడం జరిగింది క్విజ్ పోటీలో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు.

# నూతన ఆవిష్కరణలను ప్రభుత్వ ప్రోత్సహిస్తుంది మంత్రి శ్రీధర్ బాబు



**మంథని, ఫిబ్రవరి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** మంథని పట్టణంలో టీ-వర్క్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇన్నోవేషన్ ఎక్స్‌పో 2026 కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసి ప్రజలకు సాంకేతికత చేరువ చేయడం ద్వారా తెలంగాణను ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దుతామని తెలిపారు. డ్రీమ్, స్టార్ట్, రైస్ నినాదంతో మంథనిలో ఇన్నోవేషన్ ఎక్స్‌పో ప్రారంభించామని, టీ-వర్క్స్ యూనిట్ విద్యార్థుల్లో ఆవిష్కరణలపై ఆసక్తి పెంపొందించేందుకు కృషి చేస్తోందని పేర్కొన్నారు. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం సూచించినట్లుగా పిల్లలు మంచి కలలు కనాలని, వాటిని సాధించేందుకు కార్యాచరణ ప్రారంభించాలని మంత్రి సూచించారు. మంథని యువకులు వ్యవసాయ పవర్ ఫీడర్, ఆధునిక హెల్మెట్ వంటి ఆవిష్కరణలు చేయడం సంతోషకరమని అన్నారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, 7 నెలల క్రితం మంథనిలో టీ-వర్క్స్ యూనిట్ ప్రారంభించామని, ఇప్పటికే 20 ప్రభుత్వ పాఠశాలల్లో ఏఐ ఆధారిత బోధనపై ప్రత్యేక తరగతులు నిర్వహించామని తెలిపారు. రాబోయే విద్యా సంవత్సరం నుంచి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఏఐ బోధన అమలు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో టీ-వర్క్స్ సీఈఓ జోగేందర్, మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్, వైస్ చైర్మన్ సయేందర్ రెడ్డి, ఆర్‌డీఓ సురేష్, తహసిల్దార్ ఆరిపొద్దీన్, మున్సిపల్ కమిషనర్ మనోహర్, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం




**అచ్చంపేట, ఫిబ్రవరి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణ కేంద్రంలోని 13వ వార్డు వల్లపట్ల కాలనీలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ ఎస్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు వెంకటయ్య, ఉపాధ్యాయురాలు సృజన ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు, విద్యార్థినులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. స్వయం పరిపాలన దినోత్సవం సందర్భంగా విద్యార్థుల్లో అవగాహన పెంచే కార్యక్రమాలు నిర్వహించగా, ఉపాధ్యాయులు స్వయం పరిపాలన ప్రాధాన్యతను వివరించారు.

## భరోసా స్వచ్ఛంద సేవా సంస్థ సమక్షంలో రేకుల షెడ్డు ప్రారంభం




**కరీంనగర్, ఫిబ్రవరి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** అంధుల పాఠశాలలో భరోసా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో, కీర్తిశేషులు శ్రీమతి గుర్రం భారతి గారి జ్ఞాపకార్థంగా రేకుల షెడ్డు నిర్మించి శనివారం ఆర్డీఓ మహేశ్వర్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ, పాఠశాలలో రేకుల షెడ్డు ఏర్పాటు అర్హనీయమని, భరోసా సంస్థ చేపడుతున్న సేవా కార్యక్రమాలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఈ షెడ్డు నిర్మాణానికి సహకరించిన పచ్చిమట్ల స్వాతిని ప్రత్యేకంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో భరోసా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు అక్కినపల్లి నాగరాజు, సభ్యులు పెద్ది శ్రీనివాస్, మారం వెంకన్న, తాటిపల్లి సతీష్ బాబు, చిట్టుమల్ల శ్రీనివాస్, ఉపాధ్యాయులు భాస్కర్, రమేష్, సరళతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

## కూలీగా మారిన ప్రజాప్రతినిధి



**అమ్రాబాద్, ఫిబ్రవరి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** నాగర్‌కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నిర్వహించిన శిక్షణ శిబిరంలో అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ సామాన్య ప్రజల కష్టాలలోపాలుపంచుకున్నారు. వికారాబాద్ జిల్లా మాదనపల్లి గ్రామంలో ఉపాధి హామీ పనులను పరిశీలించిన ఆయన, స్వయంగా గడ్డపార పట్టి మట్టిని తవ్వి, బుట్టెడు మట్టిని నెత్తిన మోసి నేను సైతం మీలో ఒకడినే అని ప్రజలకు చాటిచెప్పారు. నాడు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పేదల పాలిట కల్పవృక్షమని, ఆ పథకం విలువ తెలిసిన నాయకుడిగా ప్రజలతో కలిసి శ్రమించడం అభినందనీయం అని స్థానికులు పేర్కొన్నారు. పదవులు ముఖ్యం కాదు, ప్రజల కష్టమే ముఖ్యం అని నిరూపిస్తున్న ఈ చర్య ప్రజల్లో విశేష స్పందన రేపింది.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



**కొండపాక, ఫిబ్రవరి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** కొండపాక మండలం ఎక్స్‌రోడ్డు వద్ద మెదక్ ఇంజనీరింగ్ కాలేజ్ సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగింది. రోడ్డు మరమ్మతులు జరుగుతుండడంతో వాహనాలను సింగిల్‌వేలో పంపించడం జరుగుతుండగా, టాటా ఏసీ వాహనం మరియు కారు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో పెద్దపల్లి జిల్లాకు చెందిన వ్యక్తి (వయసు సుమారు 40 సంవత్సరాలు) అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం. స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించగా, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ ప్రారంభించారు.

# ఆరోగ్య తెలంగాణ 100 రోజుల యాక్షన్ ప్లాన్

**-జిల్లా వైద్యాధికారి డాక్టర్ బి. రవి రాథోడ్**



**మహబూబాబాద్, ఫిబ్రవరి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో శనివారం ఆరోగ్య తెలంగాణ 100 రోజుల యాక్షన్ ప్లాన్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ బి. రవి రాథోడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమం వైద్యాధికారులు, డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్ సిబ్బంది హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి రాథోడ్ మాట్లాడుతూ, "మార్చి 4 నుండి ఆరోగ్య తెలంగాణ 100 రోజుల యాక్షన్ ప్లాన్ ప్రారంభమవుతుంది. 6 నుండి 18 సంవత్సరాల పిల్లలందరికీ స్క్రీనింగ్ నిర్వహిస్తాం. ముఖ్యంగా ప్రభుత్వ రెసిడెన్సీ స్కూల్ విద్యార్థుల్లో పోషకాహార లోపాలు, రక్తహీనత సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం. వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తాం. మానసిక రుగ్మతలను గుర్తించి, ఒత్తిడి నివారణకు యోగా, కౌన్సిలింగ్ కార్యక్రమాలు నిర్వహిస్తాం" అని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ లక్ష్మీనారాయణ, డాక్టర్ విజయ్ కుమార్, డాక్టర్ ప్రత్యూష, హెల్త్ ఎడ్యుకేటర్ కె.వి. రాజు, హెచ్.ఈ.ఓ. స్వామి, అనిల్, కవిత, ఆర్‌బీఎస్‌కే టీమ్స్, డీఈఐసి సిబ్బంది పాల్గొన్నారు.

# బాల్యవివాహాల విషయంలో బాధ్యతగా ముందుకెళదాం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్




**షాద్‌నగర్, ఫిబ్రవరి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
షాద్‌నగర్‌లో బాల్యవివాహాల నిర్మూలనకు బలమైన సందేశం వెళ్లింది. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో బాల్యవివాహ విముక్త భారత్ రథయాత్ర ఘనంగా ప్రారంభమైంది. ఆశ్రిత స్వచ్ఛంద సేవా సంస్థ, జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ సంస్థల ఆధ్వర్యంలో, లైన్ డిపార్ట్మెంట్ల సహకారంతో నిర్వహిస్తున్న ఈ ప్రచార రథయాత్రను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "జిల్లాలో ఇంకా బాల్యవివాహాలు జరుగుతుండటం ఆందోళనకరం. బాల్యవివాహాలు బాలికల విద్య, ఆరోగ్యం, భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతాయి. వాటిని అరికట్టడం సమాజం మొత్తం బాధ్యత. తల్లిదండ్రుల్లో అవగాహన కల్పించేందుకు స్వచ్ఛంద సంస్థలు చేస్తున్న కృషి అభినందనీయమైనది" అని అన్నారు. వందరోజుల పాటు కొనసాగనున్న ఈ ప్రచార యాత్ర సమాజంలో మార్పుకు దారితీసే మంచి ప్రయత్నమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆశ్రిత సంస్థ డైరెక్టర్ ఎస్. నాగరాజు, రంగారెడ్డి జిల్లా కోఆర్డినేటర్ మాధవి రెడ్డి, చైల్డ్ లైన్ ప్రతినిధులు, ఐసిడిఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. "బాల్యవివాహాలకు నో చెప్పిడ బాలల భవిష్యత్తుకు అవును చెప్పాలి" అని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పిలుపునిచ్చారు.

# ఘనంగా ఉద్యోగ విరమణ వీడ్కోలు మహోత్సవం



**వంగూరు, ఫిబ్రవరి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వంగూరు మండల కేంద్రంలో ఎంఈవో మురళి మోహన్ చారి ఉద్యోగ విరమణ వీడ్కోలు మహోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యుడు చారగొండ వెంకటేష్, రైతు కమిషన్ సభ్యులు కె.వీ.యన్ రెడ్డి, వంగూరు తహసీల్దార్ మురళి మోహన్, ఎంపీడీఓ, వంగూరు సర్పంచ్ యాదయ్య, ఉపసర్పంచ్ భాస్కర్, వంగూరు కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్ గౌడ్, మాజీ సర్పంచ్ గణేష్ రావు, జువ్వ కృష్ణయ్య, రజియా ఖాన్ తదితరులు పాల్గొన్నారు. వివిధ పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు, వివిధ పార్టీల నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొని మురళి మోహన్ చారి సేవలను కొనయాడారు. ఆయన విద్యా రంగంలో చేసిన కృషి, విద్యార్థుల అభివృద్ధికి అందించిన సేవలను ప్రశంసించారు.

# విద్యా కమిషన్ నివేదిక ఉపాధ్యాయుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేలా ఉంది తపస్




**రంగారెడ్డి, ఫిబ్రవరి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలంగాణ రాష్ట్ర విద్యా కమిషన్ ప్రభుత్వానికి అందజేసిన సిఫారసులు ఉపాధ్యాయుల మనోభావాలను దెబ్బతీసేలా, వారి ఆత్మగౌరవాన్ని భంగం కలిగించేలా ఉన్నాయని తపస్ రంగారెడ్డి జిల్లా శాఖ అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శులు కోట్ల కాశిరావు, పూజారి రమేశ్‌లు పేర్కొన్నారు. వారు మీడియాతో మాట్లాడుతూ, "విద్యా కమిషన్ తన నివేదికలో పాఠశాలల్లో మౌలిక వసతుల పెంపుదల, జాతీయ నూతన విద్యా విధానం అమలు, అధికారుల పర్యవేక్షణ, కొత్త టీచర్ల నియామకాలు వంటి అంశాలపై దృష్టి పెట్టకుండా ఉపాధ్యాయుల వేతనాలపై వ్యాఖ్యలు చేయడం దారుణం. ఉపాధ్యాయులకు ఎక్కువ వేతనాలు ఉన్నాయని సమాజం ముందు కించపరిచేలా మాట్లాడటం అంగీకారయోగ్యం కాదు" అని అన్నారు. ప్రపంచంలోనే గొప్ప వృత్తి ఉపాధ్యాయ వృత్తి అని, ఎన్నో వృత్తుల వారిని తీర్చిదిద్దే ఉపాధ్యాయుల ఆత్మగౌరవాన్ని కించపరిచే సిఫారసులను వెంటనే సవరించాలని వారు డిమాండ్ చేశారు. అలాగే టీచర్లకు భోధనేతర పనుల నుండి మినహాయింపు ఇవ్వాలని, జిహెచ్ఎం పోస్టులను 100 శాతం ప్రమోషన్ ద్వారానే భర్తీ చేయాలని కోరారు.

# ఎస్ సిడిసి కమిషనర్ గా విజయేంద్ర బోయి బాధ్యతలు స్వీకరణ



**హైదరాబాద్,ఫిబ్రవరి 28(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ కమిషనర్ గా నియమితులైన విజయేంద్ర బోయి, ఐఏఎస్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. మాసాబ్ ట్యాంక్ లోని దామోదరం సంజీవయ్య సంక్షేమ భవన్ (డిఎస్ ఎస్ భవన్) లోని 3వ అంతస్తులోని ఎస్సీడిడి కమిషనర్ కార్యాలయ కమిషనర్ చాంబర్ లో ఈ మేరకు కమిషనర్ గా విజయేంద్ర బోయి ఇప్పటివరకు కమిషనర్ (ఎఫ్ఏసీ)గా వ్యవహరించిన స్పెషల్ చీఫ్ సెక్రటరీ సభ్యసాచి ఘోష్ నుంచి చార్జి తీసుకున్నారు. ఇదిలా ఉండగా 2006 బ్యాచ్ కు చెందిన విజయేంద్ర బోయి గత రెండు సంవత్సరాలుగా మహబూబ్ నగర్ జిల్లా కలెక్టర్ గా పనిచేశారు. ఈ సందర్భంగా కమిషనర్ విజయేంద్ర బోయి మాట్లాడుతూ అత్యంత పేద వర్గాలకు చెందిన షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి సంక్షేమం కోసం తాను అంకితభావంతో పాటుపడతానని తెలిపారు. ఇదిలా ఉండగా ఎస్సిడిడి కమిషనర్ గా చార్జి తీసుకున్న విజయేంద్ర బోయి కి అడిషనల్ డైరెక్టర్ సి.శ్రీధర్ బొకే ఇచ్చి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ డైరెక్టర్లు రమాదేవి, సల్మాబాను అసిస్టెంట్ డైరెక్టర్ సుబ్బలక్ష్మి, స్టాప్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఉప్పు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా టైలర్స్ డే



**నల్లగొండ ఫిబ్రవరి 28 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ప్రపంచ టైలర్స్ కార్యక్రమాన్ని పట్టణమేరు సంఘ భవనంలో అధ్యక్షుడు నామ రాంప్రసాద్ మేరు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్న మేరు కులస్తులకు మాత్రం ప్రభుత్వం నుంచి ఉపాధి అవకాశాలు రావడంలేదని అన్నారు. రెడీమేడ్ దుస్తులు ఆన్లైన్ షాపింగ్ కార్పోరేట్ వ్యవ స్థ వచ్చిన తర్వాత మేరు కులస్తుల జీవన విధానం చాలా దుర్మార్గ స్థితిలో ఉన్నదని, ప్రభుత్వం చొరవ తీసుకొని వృత్తిదారులకు జీవనోపాధి కల్పించాలని అన్నారు. అర్హులకు కుట్టు మిషన్లను ఉచితంగా ఇవ్వాలని, కార్పొరేషన్ పదవి జిల్లా వాసులకు ఇవ్వాలని వాలని అన్నారు. టైలర్ షాపులకు ప్రభుత్వం ఉచిత కరెంటు ఇవ్వాలని అన్నారు. అర్హులకు ఇందిరమ్మ ఇల్లు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాపర్తి వెంకటేశ్వర్లు, గుంటి రామకృష్ణ, మునగాల శంకర్, సంధ్య, మీనాక్షి, విజయలక్ష్మి, జగన్, ప్రకాష్, కిరణ్, రంగయ్య, నాగేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు

# ప్రవంతి స్కూల్ ఘనంగా సైన్స్ డే

**నల్లగొండ, ఫిబ్రవరి 28 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా శనివారం ప్రవంతి స్కూల్లో హాండ్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సైన్స్ దినోత్సవ సందర్భంగా




పాఠశాల చైర్మన్ వారణాసి రజనీకాంత్ సివి రామన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సివి రామన్ తన పరిశోధన ఫలితాన్ని ధ్రువీకరించిన రోజు నే షనల్ సైన్స్ డే గా భారత ప్రభుత్వం ప్రకటించిందని, తలమానికమైన పరిశోధనలు జరిపి సైన్స్ లో దేశ శక్తి సామర్థ్యాలను ప్రపంచానికి చాటి చెప్పిన మేధావి రామన్ అని అన్నారు. మొట్టమొదట సైన్స్ లో భారత్ కు నోబెల్ సాధించిన ఘనత పి.వి.రామానికి దక్కిందని అన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన సైన్స్ ఫెయిర్ లో విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనంతరం సైన్స్ ఫెయిర్ లో గెలుపొందిన విద్యార్థులకు పాఠశాల చైర్మన్, కరస్పాండెంట్ వారణాసి రజనీకాంత్, ప్రిన్సిపాల్ రమణ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# డిండి మోడల్ స్కూల్ లో ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం







**దేవరకొండ ఫిబ్రవరి 28 (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
నల్లగొండ జిల్లా డిండి మండల కేంద్రంలోని పిఎం శ్రీ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదర్శ పాఠశాల మరియు కళాశాల లో శనివారం నాడు జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి మాట్లాడుతూ సివిరామన్ గురించి ఆయన చేసిన పరిశోధన విషయాలు తెలియజేశారు. విద్యార్థులు తక్కువ సమయంలో ఎక్కువ ప్రాజెక్టులను చేసి ప్రదర్శించారని ఆయన అన్నారు. అనంతరం రసాయన శాస్త్రం అధ్యాపకులు చింత బిచ్చయ్య ఆధ్వార్యంలో నాలుగు హౌస్ సిస్టమ్ విధ్యార్థులకు మధ్యక్విజ్ కాంపిటీషన్ నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు మెమెంటోస్ జ్ఞాపికను పార్టిసిపేషన్ సర్టిఫికెట్లను అందజేశారు. పిఎం శ్రీలో భాగంగా విద్యార్థులకు ఆటలాడుకోవడానికి కావలసినటువంటి స్పోర్ట్స్ మీట్ మెటీరియల్ కొనుగోలు చేశారు. విద్యార్థులు ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కే శ్యాంసుందర్, అధ్యాపకులు చింత బిచ్చయ్య,శ్రీలత,రమా, ఎన్ ఎన్ విజయకుమార్, పి కోదండ రామారావు, వెంకటేశ్వర్లు, ఇమ్మడి చెన్నయ్య, సోమయ్య, రమేష్, బాలకృష్ణ,రవి,రుంషా, శ్రీను శ్రీలత, సందీప్, పిడి రవి, యాదగిరి ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# డిండి ప్రాథమిక పాఠశాల లో స్వపరిపాలన దినోత్సవం

-విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ..




**దేవరకొండ ఫిబ్రవరి 28 (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
నల్లగొండ జిల్లా డిండి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులు అధికారులుగా, ఉపాధ్యాయులుగా మరియు అనధికారులుగా నేడు ఒకరోజు పాఠశాలను పరిపాలించడం జరిగింది. ఈ రోజు విద్యార్థులు భవిష్యత్తులో డాక్టర్లుగా, కలెక్టర్లుగా, సైంటిస్టులుగా, మరియు ఉపాధ్యాయులుగా అవుతామని విద్యార్థులు తమ ఇష్టాలను చెప్పారు. మరియు పాఠశాల నుండి వివిధ సబ్జెక్టులను ఉత్తమంగా బోధించిన విద్యార్థులకు ప్రథమ , ద్వితీయ మరియు కన్సోలేషన్ బహుమతులను కూడా ఇవ్వడం జరిగింది. విద్యార్థులు తమకు ఇచ్చిన సబ్జెక్టులను చాలా చక్కగా బోధించారని ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయ బృందం సంతోషాన్ని వ్యక్తం చేశారు.

# మున్సిపాలిటీ 2వ వార్డు కౌన్సిలర్ పొట్ట మురళి నీ పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

- మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్.

**దేవరకొండ ఫిబ్రవరి 28. (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
దేవరకొండ మున్సిపాలిటీ 2వ వార్డు కౌన్సిలర్ పొట్ట మురళి ఇటీవల అనారోగ్యంతో హైదరాబాద్ లోని ఆరోగ్య ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.



శనివారం ఆరోగ్య ఆసుపత్రిలో పొట్ట మురళి నీ బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు, దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,మెరుగైన వైద్యం అందించాలని ఆయన సూచించారు. త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఆయన వెంట బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కేతావత్ భీల్యానాయక్, బిఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వేముల రాజు, ముదిగొండ హరిదాస్, శ్యామ్ తదితరులు ఉన్నారు.

# తెలంగాణ మోడల్ స్కూల్ లో ఘనంగా జాతీయ విజ్ఞాన దినోత్సవం







**తిప్పర్తి,ఫిబ్రవరి 28 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** జాతీయ విజ్ఞాన దినోత్సవం ను పురస్కరించుకొని శనివారం తెలంగాణ మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కళాశాల నందు కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రిన్సిపాల్ ఏ అపర్ణ మాట్లాడుతూ శాస్త్రీయ విజ్ఞానం మానవుడి జీవితంలో ఎన్నో మార్పులు తెచ్చింది. రాతి పనిముట్ల నుంచి కృత్రిమ మేధ వినియోగం వరకు సైన్స్ అనేక అద్భుతాలకు కారణమైంది. ప్రాచీన కాలం నుంచే మనదేశంలో విజ్ఞాన శాస్త్ర అభివృద్ధి జరిగింది. ఎందరో శాస్త్రవేత్తలు తమ మార్గదర్శకత్వంతో భారత్లో శాస్త్రీయ పురోగతికి కృషి చేశారు. వారిలో సి.వి.రామన్ ఒకరు. ఆయన ఆవిష్కరించిన రామన్ ఎఫెక్ట్ భౌతికశాస్త్రంలో విప్లవాత్మక మార్పులు తెచ్చింది. రామన్ ఎఫెక్ట్ను కనిపెట్టినందుకు గుర్తుగా ఏటా మన దేశంలో ఫిబ్రవరి 28న ‘జాతీయ సైన్స్ దినోత్సవం‘గా నిర్వహిస్తారని సైన్స్ పట్ల ప్రజల్లో అవగాహన కల్పించడంతోపాటు సమాజ శ్రేయస్సులో దీని పాత్ర, విజయాలను చాటిచెప్పడం ఈ రోజు ముఖ్య



ఉద్దేశ్యం అన్నారు.

**రామన్ ఎఫెక్ట్**

రామన్ ఎఫెక్ట్ అనేది స్పెక్ట్రోస్కోపీలో ఒక దృగ్విషయం. అధిక స్థాయుల్లో ఉత్తేజిత అణువుల ద్వారా ఫోటాన్ల పరిక్షేపణంగా దీన్ని నిర్వచిస్తారు. అంటే ఒక కాంతి పుంజం అణువుల ద్వారా విక్షేపణం చెందినప్పుడు సంభవించే కాంతికాంతి తరంగం ఒక పదార్థం (వాయువు, ద్రవం, ఘనం) మీదుగా ప్రయాణించినప్పుడు, ఆ పదార్థ పరమాణు నిర్మాణంతో సంబంధం కారణంగా దిశ, తరంగదైర్ఘ్యాన్ని మారుస్తుంది. సముద్రపు నీటి రంగు నీలంలో కనిపించడానికి ఇదే కారణం.వివిధ పదార్థాల పరమాణు నిర్మాణం ఆధారంగా కాంతి ఎలా మారుతుందో అర్థం చేసుకోవడానికి రామన్ ఎఫెక్ట్ సహాయపడుతోంది.ఈయన 1888 నవంబరు 7న నాటి మద్రాసు రాష్ట్రం తిరుచిరాపల్లిలో జన్మించారు. పూర్తి పేరు చంద్రశేఖర వెంకట రామన్.1917లో కలకత్తా విశ్వవిద్యాలయంలో భౌతికశాస్త్ర అధ్యాపకుడిగా చేరారని

1926లో ఇండియన్ జర్నల్ ఆఫ్ ఫిజిక్సు స్థాపించారు. దానికి మొదటి సంపాదకుడిగా వ్యవహరించారు. 1933, ఏప్రిల్లో రామన్ ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్సీ) మొదటి భారతీయ డైరెక్టర్ గా నియమితులయ్యారు. 1934లో ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్సెను ఏర్పాటు చేశారు.

‘రామన్ ఎఫెక్ట్స్‘ను కనుక్కున్నందుకుగానూ 1930 లో భౌతికశాస్త్రంలో ఆయనకు నోబెల్ బహుమతి ప్రధానం చేస్తారని తెలిపారు .ఈ కార్యక్రమంలో భాగంగా సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించి అనంతరం వ్యాసరచన , క్విజ్ ముగ్గుల పోటీలు, నిర్వహించి బహుమతులు ప్రధానం చేశారు ఈ కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు డి రమేష్ కుమార్, ఎం యాదయ్య,ఎం.మమత ,కె.సంధ్య, వెంకట్రావు పటేల్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# నిన్నటి వరకు ఒక లెక్క..! నేటి నుండి మరో లెక్క..!

(నిర్ణయాత్మక పోరాటం దిశగా...
“సరికొత్త వ్యూహంతో సమర శంఖం)
-కప్పాటి పాండురంగారెడ్డి

**రంగారెడ్డి జిల్లా , ఫిబ్రవరి 28 (నీలగిరి ఎక్స్ ప్రెస్)** లిక్కర్ స్కాం అనేది ఓ రాజకీయ ప్రేరేపిత కుట్ర అని తేల్చిన న్యాయస్థానం నిన్నటి వరకు రాజకీయాల్లో మాపై బురదజల్లడానికి, మమ్మల్ని హేళన చేయడానికి గిట్టని వారికి ఉన్న ఏకైక అస్త్రం “లిక్కర్ కేసు“. ఏ చర్చ జరిగినా, ఏ అంశం వచ్చినా ఆఖరుకు ఈ నిరాధారమైన ఆరోపణల దగ్గరికే తీసుకొచ్చి, అపహాస్యం చేసేవారు. ఎంత నిజాయితీగా ఉన్నా.. ఆ మరక చూపి రాజకీయంగా ఎదుర్కోవాలని కుట్రలు పన్నారు. కానీ, ఊహించని విధంగా కొన్ని రోజుల్లోనే రాజకీయ ముఖచిత్రం పూర్తిగా మారిపోయింది! ధర్మం గెలిచింది! ఇక రాజకీయాల్లో మాపై ఎలాంటి నెగెటివ్ నరేషన్ లేదు.. అంతా పాజిటివ్ వైబ్ మాత్రమే! సాధారణంగా మన దేశంలో కుంభకోణాల కేసుల విచారణలు, తీర్పులు రావడానికి దశాబ్దాల కాలం పడుతుంది. దేశ చరిత్రను గమనిస్తే: ఒక సినీ నటి హత్య కేసులో



తీర్పు రావడానికి ఏకంగా 24 ఏళ్లు పట్టింది.దాణా కుంభకోణం కేసులో తొలి తీర్పు రావడానికి 17 ఏళ్లు పట్టింది. వై.ఎస్. జగన్ గారి కేసు గత 13 ఏండ్లుగా కొనసాగుతూనే ఉంది. ఓటుకు నోటు కేసు 11 ఏండ్లుగా ఇంకా నడుస్తూనే ఉంది. హర్షద్ మెహతా స్టాక్ మార్కెట్ కుంభకోణం తీర్పుకు 11 ఏళ్లు పట్టింది.

సత్యం కార్పొరేట్ ఫ్రాడ్ కేసులో తీర్పు రావడానికి 6 ఏళ్లు పట్టింది. ఇలాంటి పరిస్థితుల్లో, ఒక కుంభకోణం అంటూ ఆరోపణలు ఎదుర్కొంటున్న ఈ లిక్కర్ కేసు తీర్పు రావడం కూడా అంత ఈజీ కాదని, బహుశా జీవితకాలం పడుతుందేమో అని అందరూ భావించారు. పైగా ఆయా కుంభకోణాల్లో న్యాయస్థానాలు నేరాలను నిర్ధారించి, దోషులకు శిక్షలు కూడా విధించాయి. కానీ, లిక్కర్ కేసు అనేది అసలు ఒక స్కామే కాదు! ఇదొక రాజకీయ ప్రేరేపిత కేసు అని, కేవలం కక్షసాధింపు చర్యల్లో భాగంగానే ఈ తప్పుడు ఆరోపణలు చేశారని గౌరవ న్యాయస్థానం స్పష్టం చేసింది. అందులో నిందితులుగా ఆరోపణలు ఎదుర్కొన్న వారికి పూర్తి స్థాయి “క్లీన్ చిట్“ ఇచ్చి, వారి నిజాయితీని లోకానికి చాటిచెప్పింది. సత్యమేవ జయతే అని మరోసారి నిరూపితమైంది. ఈ తీర్పుతో రాజకీయాల్లో సరికొత్త అధ్యాయం మొదలైంది అని కప్పాటి పాండురంగా రెడ్డి అధ్యక్షులు, తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా, మాజీ చైర్మన్, రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ అన్నారు.

## హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు

**హయత్‌నగర్, ఫిబ్రవరి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షత వహించారు. విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడం, సైన్స్ ద్వారా సమాజంలో జరిగిన అభివృద్ధిని అవగాహన చేయడం ఈ వేడుకల ప్రధాన ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు.డాక్టర్ అవేస్ మొహియుద్దీన్ మాట్లాడుతూ, “జాతీయ సైన్స్ దినోత్సవం యువ మనస్సులను ఆవిష్కరణల వైపు ప్రేరేపించాలి” అని అన్నారు. ఈ సంవత్సరం సైన్స్ దినోత్సవ




థీమ్ “సైన్స్‌లో మహిళలు వికసిత్ భారత్‌ను శక్తివంతం చేయడం” అని వివరించారు. ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ మధు ధర్మపురి సర్ సి.వి. రామన్ కాంతి వ్యాప్తి పరిశోధనలో చేసిన కృషిని స్మరించారు. డాక్టర్ డి. బాల నరసింహ సాంకేతికత విద్యావేత్తల అభ్యాసంలో చూపుతున్న ప్రభావాన్ని వివరించారు. డాక్టర్ వి. శేఖర్ మాట్లాడుతూ, “సైన్స్ లేకుండా సమాజం అభివృద్ధి చెందదు” అని అన్నారు. డాక్టర్ ఎ. దుర్గాప్రసాద్ రోజువారీ జీవితంలో సైన్స్ ప్రాముఖ్యత, జాతీయ అభివృద్ధిలో దాని పాత్రపై తన అభిప్రాయాలను పంచుకున్నారు.విద్యార్థులు పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా పరిశోధనాత్మక శాస్త్రీయ భావనలతో నిమగ్నమవ్వాలని ఉపన్యాసకులు సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు బి. సుభాషిణి, కె. ఉమారాణి, ఎ. రజిత, బి. మమతతో పాటు విద్యార్థులు చురుకుగా పాల్గొని వేడుకను ఉత్సాహభరితంగా మార్చారు.

# సైన్స్ పరిశోధనల ద్వారా దేశం అభివృద్ధి దశలో పయనిస్తుంది

-భారత్ భవిత స్కూల్ కరస్పాండెంట్ మోదుగు సత్తి రెడ్డి.




**నల్లగొండ, ఫిబ్రవరి 28 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా శనివారం పాఠశాలలో సివి రామన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు అనంతరం ఆయన మాట్లాడుతూ జీవితాన్ని మార్చే శక్తి సైన్స్ కు ఉందని, దై నందిన జీవితంలో సైన్స్ యొక్క ప్రభావం ఎంతో ఉందని కరోనా సమయంలో కోవిడ్ వ్యాక్సిన్ లాంటి అద్భుతాలు ఎంతో ప్రయోగం ద్వారా ఉపయోగకరంగా పనిచేశాయి అన్నారు. ఫోన్లు, ఇంటర్నెట్, వ్యవసాయ ఆధునీకరణ పరికరాల ద్వారా ఎంతో అభివృద్ధి దశలో పయనిస్తున్నామని అన్నారు. భారత్ ను సైన్స్ సామ్రాజ్యంగా మార్చేందుకు ప్రతి విద్యార్థి కృషి చేయాలని సివి రామన్ ఆశయాల సాధన కోసం శ్రమించాలని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు సైన్స్ ఫెయిర్ లో తయారుచేసిన ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ మోదుగు జ్యోతి, ఇంచార్జ్ లక్ష్మి, సైన్స్ టీచర్స్ డాక్టర్ సుధాకర్, కావ్య శ్రీ, ఉపాధ్యాయులు నాగేందర్, ఉపేందర్, మౌలానా, నాగయ్య, బెంజిమెన్, వార్డెన్లు కార్తీక్, స్వాతి, ఆయాలు రేణుక, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీలో చేరిన పిసి తండా యువకులు



**మంచాల, ఫిబ్రవరి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పిసి తండా గ్రామానికి చెందిన 20 మంది యువకులు బీజేపీలో చేరారు. మంచాల బీజేపీ మండల అధ్యక్షుడు నూకం రాజు ముదిరాజ్ అధ్యక్షతన పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు బోసుపల్లి ప్రతాప్, గోగిరెడ్డి లచ్చి రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు వింజమూరి వెంకట్ రెడ్డి సమక్షంలో యువకులు కాషాయ కండువాలు ధరించి పార్టీలో చేరారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, “నరేంద్ర మోడీ పథకాలు ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొస్తున్నాయి. యువత బీజేపీ వైపు ఆకర్షితులవడం పార్టీ బలాన్ని మరింత పెంచుతుంది” అని పేర్కొన్నారు.కార్యక్రమంలో జిల్లా నాయకులు దన్నే భాషయ్య, పాండాల జంగయ్య గౌడ్, కొంగర జనార్దన్ రెడ్డి, మెండు వెంకట్ రెడ్డి, సర్పంచ్ శంకరయ్య, ఉపసర్పంచ్ యాట రమేష్, రాజేందర్, శ్రీశైలం, యాదిరెడ్డి, రవి, శేఖర్, ముత్యం రెడ్డి, ఐలయ్య, యువ మోర్చా నాయకులు సందీప్, మోహన్ రెడ్డి, ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.పార్టీలో చేరిన వారిలో వార్డు సభ్యుడు మేగావత్ గణేష్, విజయ్ కుమార్, మేగావత్ రాజు, హరికృష్ణ, సుమన్, వినోద్ కుమార్, గణేష్, కిరణ్, రాజేష్, ప్రేమ్ కుమార్, ఉదయ్ కుమార్, నితిన్, అరుణ్, బాలు, రమేష్, హతి రామ్, చింటూ తదితరులు ఉన్నారు.

## కుమ్మెర ఘటనపై కాంగ్రెస్ నాయకులు బాధితులకు అండగా నిలవాలి

- జంగిలి నిరంజన్



**వెల్దండ, ఫిబ్రవరి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వెల్దండ మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ జంగిలి నిరంజన్ మాట్లాడుతూ కుమ్మెర జాతరలో రజక కులానికి చెందిన రెండు నెలల పాప మృతి చెందిన ఘటనపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి బాధిత కుటుంబానికి అండగా నిలవాల్సింది పోయి అగ్రకుల నాయకులకు వత్తాసు పలకడం సమంజసం కాదని ఆయన విమర్శించారు. “దళిత వర్గాలకు చెందిన నాయకుడు బాధితులకు అండగా ఉండకపోవడం దళిత బహుజనులు సహించరని, తప్పు చేసిన వారిపై ఎంతటి వారైనా క్రిమినల్ కేసులు నమోదు చేసి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి” అని జంగిలి నిరంజన్, ముక్తాల శేఖర్ ముదిరాజ్, పోలే అశోక్‌లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జంగిలి ప్రసాద్, కొమ్ము నాగయ్య, అరుణ్‌కుమార్‌తో పాటు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## సవాళ్లను ఆహ్వానించు ఉజ్వల భవిష్యత్తును ఆశించు

లక్ష్యసాధనలో ఎవరైతే
ముందుంటారో సమస్యలను
సవాలుగా ఆహ్వానిస్తారో

నూతన ఆవిష్కరణలతో
సమగ్ర కార్యాచరణతో
సృజనాత్మకతను జీవనశైలి
గాఎంచుకొని నూతన
సాంకేతికతతో ముందడుగు
వేస్తారో ఉజ్వల భవిష్యత్తు
వారి సొంతమౌతుంది

లక్ష్య సాధనలో
వెనకడుగు వేయద్దు
సవాళ్ల సుడిగుండంలో
చిక్కుకున్న ధైర్యాన్ని వీడద్దు
కష్టం మనల్ని పీడించిన
ఇష్టాన్ని పెంచుకొని
గమ్యాన్ని చేరాలి

నిప్పులో కరిగిస్తేనే
బంగారం మెరిసేది
సవాళ్లను ఎదిరించి
నిలిస్తేనే చరిత్రలో
నిలిచేది మార్పును తెచ్చేది

భయాన్ని వీడండి
ఆత్మవిశ్వాసంతో
అడుగు ముందుకెయ్యండి
బాధ్యత భారం కావద్దు
నిరాశ నిస్పృహలను
నీదరి చేరనీయద్దు

నేటి శ్రమయే రేపటి
విజయానికి నాంది

సవాళ్లను స్వీకరించినవారికే
ఉజ్వల భవిష్యత్తు ఉంటుంది
కష్టాల కడలిలో అలల తాకిడికి
భయపడకు ధైర్యమే నీకు దారి
చూపుతుంది సమస్యలు
సవాళ్లు నీ లక్ష్య సాధనకు
అడ్డుకారాదు
అవరోధాలను అవకాశాలుగా
మలుచుకో అభివృద్ధి పథాన
సాగిపో

సంకల్పం పట్టుదలతో బంగారు
భవిష్యత్తుకు బాటవేయాలి

ఇతరుల విమర్శలకు
విలువ ఇవ్వకు
నీ నమ్మకమే నీదారి కావాలి

ఓటమిని చూసి కుంగకు
ఎదురు దెబ్బలు పాఠాలుగా
మలుచుకో అనుభవాలను
గుణం పాఠంగా స్వీకరించి
విజయాలను సాధించు

సాహసమే ఊపిరిగా
పట్టుదలే పెట్టుబడిగా
ప్రగతి పురోగతియే లక్ష్యంగా
ముందడుగు వేయాలి

ముళ్ళ బాటను చూసి
వెనుకడుగు వేయకు
భయం నీధరిచేరితే
బానిసౌతావు

సవాళ్లను స్వీకరిస్తే
విజేతవౌవుతావు
నీ సాహసమే ఉజ్వల
భవిష్యత్తుకు వారధి
ప్రతిభతో ప్రగతికి సారథివై
ముందుకు సాగిపో

వికసిత భారత్ లక్ష్య
సాధనకై ఆత్మ నిర్భరతతో
వజ్ర సంకల్పంతో
ఉద్యుక్తులు కావాలి
జాతి ఉద్ధరణలో దివ్వెవై
వెలగాలి చీకటిని తొలగించాలి

నేదునూరి కనకయ్య
అధ్యక్షులు తెలంగాణ
ఎకనామిక్ ఫోరం
ఫ్రీలాన్స్ రచయిత కాలమిస్ట్
కరీంనగర్9440245771



# సైన్స్‌తోనే అభివృద్ధి సాధ్యం-డీఈఓఅబ్దుల్ హమీద్

### చీకటిని చెదరగొట్టి వెలుగు చూపేది సైన్స్సేగంగవరం రామకృష్ణారెడ్డి



**వనపర్తి ఫిబ్రవరి 28( నీలగిరి ఎక్స్ ప్రెస్ ):** వనపర్తి జిల్లా కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌లో శనివారం సైన్స్ డే సందర్భంగా సైన్స్ ఫెయిర్‌ను ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి వనపర్తి జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) ఎండి అబ్దుల్ హమీద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైన్స్ నిత్యజీవితంలో మానవాళికి అపారమైన సేవలు అందిస్తోందని తెలిపారు. శాస్త్రీయ దృక్పథం పెంపొందితేనే దేశం పురోగమిస్తుందని, విద్యార్థులు సైన్స్‌ను కేవలం పాఠ్యాంశంగా కాకుండా జీవన విధానంగా స్వీకరించాలని సూచించారు. సైన్సును సద్వినియోగం చేసుకుని కొత్త ఆవిష్కరణలతో సమాజ అభివృద్ధికి దోహదపడాలని పిలుపునిచ్చారు.

ఆత్మీయ అతిథిగా హాజరైన తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) వనపర్తి జిల్లా ప్రధాన కార్యదర్శి గంగవరం రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ, "సైన్స్ అంటే సత్యాన్వేషణ. చీకటిని తొలగించి వెలుగు వైపు నడిపించేది సైన్సే" అనిఅన్నారు. ప్రపంచానికి మార్గదర్శకులైన శాస్త్రవేత్తలను ఈ సందర్భంగా స్మరించుకుంటూ, ప్రతి విద్యార్థి కూడా శాస్త్రవేత్తలా ఆలోచించి కొత్త విషయాలను అన్వేషించాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో వనపర్తి మండల విద్యాధికారి మద్దిలేటి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నీలం పాపయ్య నాయుడు, ట్రాస్మా నాయకులు జావిద్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ ప్రాజెక్టులు అతిథులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

# మార్నింగ్ వాక్ లో ప్రజా సమస్యలపై దృష్టి

### . మున్సిపల్ చైర్మన్ పత్య నాయక్



**ఆమనగల్లు, ఫిబ్రవరి 28(నీలగిరి ఎక్స్ ప్రెస్) :** ఆమనగల్లు మున్సిపాలిటీ మూడవ వార్డు నుచ్చుగుట్ట తండ, వేముల కుంట తండ, సాకి బండ తండ ప్రాంతాల్లో మున్సిపల్ చైర్మన్ పత్య నాయక్, వైస్ చైర్ పర్సన్ గీత తో కలిసి మార్నింగ్ వాక్ నిర్వహించారు. ప్రజలతో నేరుగా మాట్లాడి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని మున్సిపల్ చైర్మన్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ కమిషనర్ శంకర్ నాయక్, ఏడవ వార్డు కౌన్సిలర్ నరేందర్ నాయక్, చందు నాయక్, రవి రాథోడ్, రాజు, కిషన్,జైపాల్ రమేష్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నేటి బాలలే రేపటి శాస్త్రవేత్తలు ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి





**మిర్యాలగూడ, ఫిబ్రవరి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా మిర్యాలగూడ పట్టణంలోని రెడ్డి కాలనీ డౌహిల్ స్కూల్ మరియు క్రిష్ణ కాలనీలోని శ్రీ చైతన్య స్కూల్లో నిర్వహించిన సైన్స్ ఫెయిర్‌లో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. విద్యార్థులు రూపొందించిన నమూనాలు, పరిశోధనలను ఆయన పరిశీలించి ప్రశంసించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "నేటి బాలలే రేపటి శాస్త్రవేత్తలు. చిన్ననాటి నుంచే సైన్స్ ఫెయిర్లు విద్యార్థుల్లో శాస్త్ర, సాంకేతిక పరిశోధనల పట్ల ఆసక్తిని పెంచుతాయి. ప్రముఖ భారతీయ భౌతిక శాస్త్రవేత్త సర్ సి.వి. రామన్ 1928లో కనుగొన్న రామన్ ఎఫెక్ట్కు గుర్తుగా ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 28న జాతీయ సైన్స్ దినోత్సవాన్ని జరుపుకుంటాం" అని తెలిపారు.మానవాళి అభివృద్ధికి, సమస్యల పరిష్కారానికి విద్యార్థులు తమ పరిశోధనల ద్వారా పాటుపడాలని ఆయన పిలుపునిచ్చారు. విద్యార్థులను ప్రోత్సహించిన ఉపాధ్యాయులను, స్కూల్ యాజమాన్యాన్ని ఎమ్మెల్యే అభినందించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గుడిపాటి శిరీష నవీన్, కాంగ్రెస్ నాయకులు దేశిది శేఖర్ రెడ్డి, కార్యకర్తలు, బిఎల్ఆర్ బ్రదర్స్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ వెంకటేశ్వర స్వామి కల్యాణ వైభోగం





**కడ్తాల్, ఫిబ్రవరి 28 ( నీలగిరి ఎక్స్ ప్రేస్ )** కడ్తాల్ మండలం రావిచేడ్ గ్రామంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద శ్రీమాన్ తిరుమల వింజమూరి రామానుజా చార్యుల ఆధ్వర్యంలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. పచ్చటి తోరణాలు, మంగళ వాయిద్యాలు, వేద పండితుల మంత్రోచ్చారణలు, పదకవితా పితామహుడు అన్నమయ్య సంకీర్తనల మధ్య సాగిన స్వామి వారి కల్యాణాన్ని తిలకించేందుకు నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా నిర్వాహకులు భారీగా షామియానాలతో చలువ పందిళ్ళు వేశారు. భక్తులకు టేకుల జయసుధ జైపాల్ రెడ్డి, నక్కపోతు సరిత సంతోష్ ముదిరాజ్ అన్నప్రసాద కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కళ్యాణోత్సవానికి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.కార్యక్రమంలో సర్పంచ్ బొప్పిడి గోపాల్, ఉప సర్పంచ్ యాదయ్య, వార్డు సభ్యులు రవికుమార్, భూపతి, అనిల్, రమేష్, సరిత, రాణి, శోభ, బొగురమ్మ, రామస్వామి, మాజీ సర్పంచులు లక్ష్మీ కస్న నాయక్, మహేందర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీలు యాదయ్య, రంగయ్య, వసంత, మాజీ ఉప సర్పంచ్ వెంకటేష్, బీఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు రమేష్ యాదవ్, నాయకులు యాట నరసింహ, లింగం, బిక్షపతి, బీరప్ప, రామచంద్రయ్య, పవన్ కుమార్, రవికుమార్, రమేష్ పాండు, శ్రీశైలం, రాములు, రవి, సాయికుమార్, విక్రాంత్, యువకులు, మహిళలు భక్తులు తదితరులున్నారు.

# సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన ఆమనగల్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యాదిలాల్



**హైదరాబాద్, ఫిబ్రవరి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనముల రేవంత్ రెడ్డిని ఆమనగల్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యాదిలాల్ కలిశారు. ఈ సందర్భంగా న్యాయవాదుల రక్షణ చట్టం అమలు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.న్యాయవాదుల రక్షణ చట్టం అమలు కోసం అలంపూర్ నుంచి సెక్రటేరియట్ వరకు న్యాయవాదులు పాదయాత్ర నిర్వహించారు. అనంతరం దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో న్యాయవాదుల బృందం ముఖ్యమంత్రిని కలిసి వినతిపత్రం అందజేసింది.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారని, న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారని ఆమనగల్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యాదిలాల్ తెలిపారు.

# ఎంజేపీ గురుకులంలో ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం




**పఠాన్‌చెరు, ఫిబ్రవరి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పఠాన్‌చెరు మండలంలోని చిన్న కంజర్ల గ్రామంలో గల మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాల, కళాశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురుకుల ప్రిన్సిపాల్ బి. స్రవంతి మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం వైపు దృష్టి సారించాలని సూచించారు. సమాజంలో వస్తున్న ఆధునిక సాంకేతిక మార్పులకు అనుగుణంగా విద్యార్థులు చదువుతో శాస్త్రీయ విజ్ఞానం పెంపొందించుకోవాలని, ప్రయోగశాలలు ప్రజలకు ఉపయోపడే విధంగా ఉండాలని అన్నారు. 1928లో భారత భౌతిక శాస్త్రవేత్త సి.వి. రామన్ ఆవిష్కరించిన రామన్ ఎఫెక్ట్కు గుర్తుగా ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 28న జాతీయ సైన్స్ దినోత్సవాన్ని జరుపుకుంటామని విద్యార్థులకు తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సైన్స్ సంబంధిత అంశాలపై పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు దశరథ్, అనిల్, అమ్రీన్, అపర్ణ, శ్రీలక్ష్మి, మహేష్, సురేష్‌తో పాటు విద్యార్థులు చురుకుగా పాల్గొని వేడుకను ఉత్సాహభరితంగా మార్చారు.

## విద్యా కమిషన్ నివేదిక ఉపాధ్యాయ హక్కులపై గొడ్డలి పెట్టు మందల లక్ష్మీనారాయణ



**ఎలిగేడు, ఫిబ్రవరి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ విద్యా కమిషన్ నివేదిక ఉపాధ్యాయుల హక్కులపై గొడ్డలి పెట్టినట్లుందని టీఆర్‌టీఫ్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు మందల లక్ష్మీనారాయణ విమర్శించారు. శనివారం ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, "ఆకునూరి మురళి చేసిన సిఫార్సుల్లో రాష్ట్ర బడ్జెట్‌లో 18 శాతం నిధులను పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కేటాయించడం వంటి అంశాలను స్వాగతిస్తున్నాం. అయితే తన పరిధిలో లేని ఉపాధ్యాయుల జీతభత్యాలపై చేసిన వ్యాఖ్యలు ఆక్షేపనీయమైనవి" అని పేర్కొన్నారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా పాఠశాలలను ప్రయోగశాలలుగా మార్చి వివిధ పేర్లతో విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తూ, ఉనికిలో ఉన్న పాఠశాలలను బలోపేతం చేయకపోవడం వల్ల క్షేత్రస్థాయిలో చదువుకుంటున్న విద్యార్థులకు తీవ్ర నష్టం జరుగుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ప్రభుత్వం ఉపాధ్యాయ సంఘాలతో చర్చలు జరిపి, విద్యా వ్యవస్థ బలోపేతానికి సరైన నిర్ణయం తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# హక్కులపై అవగాహన కలిగి ఉండాలి

**- తహసిల్దార్ యాకన్న**



**ఎలిగేడు, ఫిబ్రవరి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తహసిల్దార్ యాకన్న సూచించారు. మండలంలోని నర్సాపూర్ గ్రామంలో శనివారం పౌర హక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "కుల వివక్ష, అంటరానితనాన్ని నిర్మూలించాలి. అన్ని కులాలు, వర్గాల వారు సోదరభావంతో మెలగాలి. సమాజంలో సమానత్వం నెలకొనేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలి" అని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పల్లెర్ల వెంకటేష్ గౌడ్, ఏఎస్ఐ శ్రీనివాస్, ఎంఈఓ నరేంద్ర చారి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# కుమ్మెర ఘటనపై కాంగ్రెస్ వైఖరిని ప్రశ్నించిన ఐకాస




**నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కుమ్మెర గ్రామ ఘటనపై బాధితుల న్యాయ పోరాట ఐక్య కార్యాచరణ కమిటీ (ఐకాస) ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్‌రామ్ భవన్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఐకాస కన్వీనర్ బోనాసి రాంచందర్ అడ్వకేట్, కో-కన్వీనర్లు పర్వతాలు, కోళ్ళ శివ, ఆర్. శ్రీను, ఎదిరేపల్లి కాశన్న, శివశంకర్ యాదవ్, అంతటి కాశన్న, నిజాం, పొదిల రామయ్య, నాగపూరి మధు, నవీన్, అశోక్, కళ్యాణ్, పృథ్వీరాజు, వెంకటయ్య, రామకృష్ణ, తారాసింగ్ తదితరులు పాల్గొన్నారు. వక్తలు మాట్లాడుతూ, "నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి బాధితుల పక్షమా, నిందితుల పక్షమా స్పష్టత ఇవ్వాలి. కుమ్మెర గ్రామ పర్యటనలో కాంగ్రెస్ నాయకులు నిజాలను సమాధి చేసే విధంగా ప్రవర్తించారు. బాధితురాలి వ్యక్తిత్వ హననానికి పాల్పడటం దారుణం. ఆమె ఏ కులానికి చెందినా, ఎన్ని పెళ్లిళ్లు జరిగినా, ఎంతమంది పిల్లలు ఉన్నా గుడిలో జరిగిన దాడి వాస్తవం. మహిళలను కించపరిచిన ఘటన వాస్తవం. నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలి" అని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ నిజ నిర్ధారణ కమిటీ ముందుగా బాధితులను కలవాలని, ఆ తర్వాత సంఘటన స్థలాన్ని, సంబంధిత అధికారులను, చివరగా మళ్లీ బాధితులను కలవాలని సూచించారు. "కుమ్మెర గ్రామంలో కాంగ్రెస్ నాయకులు నిందితులకు మద్దతు పలికినట్లు అనిపిస్తోంది. కాంగ్రెస్ పార్టీ తన మొండివైఖరిని విడనాడి, పోలీసులకు స్వేచ్ఛనిచ్చి నిందితుల అరెస్ట్ జరగాలని" అని ఐకాస నాయకులు సవాల్ విసిరారు. బాధితులకు న్యాయం జరగకపోతే నాగర్‌కర్నూల్ కేంద్రంగా రిలే దీక్షలు, శాంతి ర్యాలీలు, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడి, చివరగా బహిరంగ సభ నిర్వహిస్తామని హెచ్చరించారు. "బాధితులకు న్యాయం జరిగే వరకూ ఐకాస పోరాటం కొనసాగుతుంది" అని నాయకులు స్పష్టం చేశారు.

## కొత్తూరు పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన సీపీ సుధీర్ బాబు




**షాద్‌నగర్, ఫిబ్రవరి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గంలోని కొత్తూరు పోలీస్ స్టేషన్‌ను ఫ్యూచర్ సిటీ సీపీ సుధీర్ బాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పోలీస్ స్టేషన్ ప్రాంగణం, రికార్డ్ రూమ్, స్టేషన్ రైటర్ రూమ్, రిసెప్షన్ సెంటర్ వంటి విభాగాలను పరిశీలించారు. వాటిని చక్కగా నిర్వహించుకోవాలని సూచించారు. నేరాల రేటు, రోడ్డు ప్రమాదాలు, చోరీ కేసులు, నమోదైన కేసుల పురోగతిపై ఆయన ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో డీసీపీ సిహెచ్. శిరీష, ఏసీపీ ఎస్. లక్ష్మీనారాయణ, సీఐ నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

## సూర్యాపేట ఎమ్మెస్సార్ కిడ్స్ పబ్లిక్ స్కూల్ లో సైన్స్ ఫెయిర్.....

-ఆకట్టుకున్న గంగా రాజ్విక ల్యాండ్ ట్రాన్స్ పోర్ట్ ప్రాజెక్ట్ వర్క్...

-పాల్గొన్న ఎస్సిడిడి ఉమెన్స్ వింగ్ స్టేట్ ప్రెసిడెంట్ శ్రీమతి కె.లత..






**సూర్యాపేట, ఫిబ్రవరి 28(నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఎమ్మెస్సార్ కిడ్స్ పబ్లిక్ స్కూల్, సూర్యాపేట లో జరిగిన సైన్స్ పెయిర్ ఘనంగా జరిగింది. ఈ సైన్స్ ఫెయిర్ లో పాఠశాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సైన్స్ ఫెయిర్ లో గంగా రాజ్విక విద్యార్థి ల్యాండ్ ట్రాన్స్పోర్ట్ పై చేసిన ప్రాజెక్టు వర్క్ మరియు ఇచ్చిన ప్రదర్శన ఆహుతులను బాగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఉమెన్స్ వింగ్ స్టేట్ ప్రెసిడెంట్ సూర్యాపేట డిఎస్డివో సూపరింటెండెంట్, ఏ ఎస్ డబ్ల్యూ ఓ శ్రీమతి కె.లత, కళాశాల ప్రిన్సిపల్ కొల్లు శ్రీనివాస్ రావు, ప్రముఖ డాక్టర్ గంగా రాజీవ్ రెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# క్రమశిక్షణతో చదువుకొని ఉన్నతస్థాయికి ఎదగాలి

**- ఎంఈఓ టి. మనోహర్**



**ఫరూక్‌నగర్, ఫిబ్రవరి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** విద్యార్థులు విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణతో చదువుకొని భవిష్యత్తులో ఉన్నతస్థాయికి ఎదగాలని ఫరూక్‌నగర్ మండల విద్యాధికారి టి. మనోహర్ సూచించారు. శనివారం ఫరూక్‌నగర్ మండలం చేల్క చిల్కమర్రి ప్రాథమిక పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "విద్యార్థులు చిన్నతనం నుంచే తల్లిదండ్రులను, గురువులను గౌరవించాలి. క్రమశిక్షణతో ఎదిగి తల్లిదండ్రులకు, సమాజానికి మంచి పేరు తీసుకురావాలి. బంగారు భవిష్యత్తు కోసం కృషి చేయాలి" అని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జనార్ధన్ రెడ్డి, గంట్లవెల్లి ప్రధానోపాధ్యాయులు శ్రీధర్ రెడ్డి, ఉపాధ్యాయులు బిజిలి సత్యం, పారిజాత, యూటీఎఫ్ సీనియర్ నాయకులు యాదయ్య పాల్గొన్నారు. స్వయం పరిపాలన దినోత్సవంలో తాత్కాలిక ప్రధానోపాధ్యాయులుగా చరణ్, విగ్నేష్, ఉపాధ్యాయులుగా సుచిత్ర, రిషి, అర్చన, శ్రీజా రెడ్డి, అక్షిత, హర్ష విద్యార్థులు వ్యవహరించి సహ విద్యార్థులకు బోధన చేశారు.

## డబుల్ బెడ్‌రూమ్ గృహాల పట్టాల పంపిణీ చేసిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**షాద్‌నగర్, ఫిబ్రవరి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** షాద్‌నగర్ ప్రజలు పదేళ్లుగా ఎదురుచూస్తున్న స్వంత ఇంటి కల సాకారమైంది. డబుల్ బెడ్‌రూమ్ గృహాల పట్టాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ పథకం అర్హులైన కుటుంబాలకు చేరేందుకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రత్యేక కృషి, పట్టుదలతో ముందడుగు వేశారు. ప్రజల అవసరాలను అర్థం చేసుకుని సంక్షేమ కార్యక్రమాలను వేగవంతం చేస్తున్న నాయకుడిగా ఆయన పేరు మరింత ప్రతిష్టను సంతరించుకుంది. 18వ వార్డు కౌన్సిలర్ జమాల్‌పూర్ సంతోషి చందులాల్ చేతుల మీదుగా లబ్ధిదారులకు పట్టాలు అందజేయగా, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ, "ప్రజల సంక్షేమమే నా ధ్యేయం. స్వంత ఇల్లు ప్రతి కుటుంబానికి గౌరవం, భద్రత, భవిష్యత్తుకు బలమైన పునాది. ప్రభుత్వ పథకాలు నిజమైన లబ్ధిదారుల వరకు చేరాలనే సంకల్పంతో పని చేస్తున్నాను" అని స్పష్టం చేశారు. లబ్ధిదారుల్లో సలీమ బేగం ఆనందంతో మాట్లాడుతూ, "ఎన్నేళ్ల నిరీక్షణ తర్వాత మా స్వంత ఇంటి కల నెరవేరింది. ఇది మా కుటుంబానికి మరపురాని రోజు. ఎమ్మెల్యే శంకరన్నకు రుణపడి ఉంటాం" అని భావోద్వేగంతో తెలిపారు. ఈ కార్యక్రమం షాద్‌నగర్ అభివృద్ధి ప్రయాణంలో మరో కీలక మైలురాయిగా నిలిచింది. ప్రజల సంక్షేమం పట్ల ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చూపుతున్న కట్టుబాటు, నాయకత్వం ప్రజల్లో విశ్వాసాన్ని మరింత బలపరుస్తోంది.

# జీపీఓకు అండగా నిలిచిన రెవెన్యూ జేఏసీ నాయకులు..

### మహబూబ్ నగర్ ఆస్పత్రిలో పరామర్శ



**మహబూబ్ నగర్, ఫిబ్రవరి 28(నీలగిరి ఎక్స్ ప్రెస్):** రోడ్డు ప్రమాదంతో గాయపడిన జీపీఓ గోపాల్ కు తెలంగాణ రెవెన్యూ జేఏసీ అండగా నిలిచింది. జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి నేతృత్వంలో తెలంగాణ తహశీల్దార్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.రాములు, ప్రధాన కార్యదర్శి రమేష్ పాక మహబూబ్ నగర్ ఆస్పత్రిలో పరామర్శించారు.ఆర్థిక సహాయాన్ని అందచేయడంతో పాటు ఆస్పత్రి నిర్వాహకులతో మాట్లాడి వైద్య ఖర్చులు లేకుండా చేశారు. కార్యక్రమంలో మహబూబ్ నగర్ జిల్లా నాయకులు గన్నిరాం, శ్రీనివాస్, దేవేందర్, శ్యాం సుందర్, లక్ష్మి నరసింహ, పాండు, తదితరులు పాల్గొన్నారు.

## కాబోయే వైద్యులు పట్టణ ప్రాంతం తో పాటు, గ్రామీణ ప్రాంతంలో వైద్య సేవలు అందించడం పై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్




**నల్లగొండ, ఫిబ్రవరి 28 ( నీలగిరి ఎక్స్ ప్రెస్):** శనివారం ఆయన నల్గొండ ప్రభుత్వ వైద్య కళాశాల లో నిర్వహిస్తున్న వైద కళాశాల వార్షికోత్సవ ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు . పట్టణ ప్రాంతంలో ప్రజలకు 75 శాతం నాణ్యమైన వైద్య సంరక్షణ సేవలు అందుబాటులో ఉన్నాయని,అయితే ఈ శాతం గ్రామీణ ప్రాంతంలో కేవలం 35% మాత్రమే ఉన్నాయన్నారు. ప్రభుత్వపరంగా ఆరోగ్య సదుపాయాలతో పాటు, ప్రాథమిక వైద్యరోగ్య కేంద్రాలు, ఆరోగ్య ఉప కేంద్రాలు, అంగన్వాడి కేంద్రాల ద్వారా వైద్య ఆరోగ్య సేవలు అందిస్తున్నప్పటికీ, ఇంకా 65% మంది గ్రామీణ ప్రాంతంలో ప్రజలు సరైన వైద్యశాలు పొందలేకపోతున్నారని, అందువల్ల వైద్యులందరూ గ్రామీణ ప్రాంతంలో వైద్య సేవలు అందించడంపై దృష్టి సాధించాలని విజ్ఞప్తి చేశారు. ఎంబీబీఎస్ అంతంలేని చదువని, భవిష్యత్తులో పీజీ, స్పెషలైజేషన్ కి ఇది ఉపయోగపడుతుందని, అంతేకాక ఎంచుకున్న సబ్జెక్టులో నిష్ణాతులు కావాల్సిన అవసరం ఉందని, అందుకు వైద్య విద్యార్థులు భవిష్యత్తులో మంచి సబ్జెక్టులు ఎంచుకొని విజయం సాధించాలని ఆశించారు.

# నల్లగొండను స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దడమే నా లక్ష్యం

### -:మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి పిలుపు.




**నల్లగొండ ,ఫిబ్రవరి 28 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** నల్లగొండ నగరాన్ని స్మార్ట్ సిటీగా రూపుదిద్దేందుకు రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసికట్టుగా పనిచేయాలని మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి శనివారం మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో జరిగిన తొలి కార్పొరేషన్ సమావేశంలో ఆమె స్పష్టం చేశారు. నగర అభివృద్ధిలో పారిశుధ్యం, తాగునీరు, వీధిలైట్లు, డ్రైనేజ్ వంటి ప్రాథమిక సమస్యలకు ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు వచ్చే ఏడాది నాటికి 24 గంటల కృష్ణా జలాలు అందించే లక్ష్యంతో ప్రణాళికలు సిద్ధం చేశామని వెల్లడించారు. వేసవిలో విద్యుత్ అంతరాయం లేకుండా ఐదు సబ్ స్టేషన్ల నిర్మాణం చేపట్టామని, ఒకటి ఇప్పటికే పూర్తయిందని మిగతా పనులు త్వరలో పూర్తి చేసి ప్రజలకు నిరంతర విద్యుత్ సరఫరా కల్పిస్తామని హామీ ఇచ్చారు ప్రకాశం బజార్ ప్రాంతంలో సమస్యలు దృష్టిలో ఉంచుకుని వీధి వ్యాపారులకు ప్రత్యామ్నాయ దుకాణాల ఏర్పాటు చేశామని, అక్కడ కనీస సౌకర్యాలు కల్పిస్తామని పేర్కొన్నారు. కార్పొరేటర్లు ప్రస్తావించిన పారిశుధ్య లోపాలు, దోమల ఉధృతి, వీధిలైట్ల సమస్యలపై తక్షణ చర్యలు తీసుకుంటామని మేయర్ తెలిపారు.

# ఘనంగా షాద్‌నగర్ వాసవి, వనిత క్లబ్‌ల నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం




**షాద్‌నగర్, ఫిబ్రవరి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** స్థానిక సాయి కృష్ణ (నక్షత్ర) మహబూబ్‌నగర్ రోడ్ ఫంక్షన్ హాల్‌లో వాసవి క్లబ్ షాద్‌నగర్ మరియు వనిత క్లబ్ షాద్‌నగర్ 2026 నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం శనివారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి క్లబ్ ఇంటర్నేషనల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ మిట్టదూరయ్య, ఎ102కూ క్లబ్ గవర్నర్ అల్లాది పరమేశ్వర్ ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.క్లబ్ గవర్నర్ అల్లాది పరమేశ్వర్ నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. వాసవి క్లబ్ షాద్‌నగర్ అధ్యక్షుడిగా గుంత సత్యనారాయణ, కార్యదర్శిగా గజవాడ యశ్వంత్, కోశాధికారిగా సోమ శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించారు. వనిత క్లబ్ షాద్‌నగర్ అధ్యక్షురాలిగా బ్రుగుమల్ల చంద్రిక, కార్యదర్శిగా గజ్జల మహేశ్వరి, కోశాధికారిగా సిరిపురం శ్రీదేవి ప్రమాణ స్వీకారం చేశారు. వీరితో పాటు క్లబ్ వివిధ విభాగాల బాధ్యులు, సభ్యులు కూడా ప్రమాణ స్వీకారం చేశారు.ఈ సందర్భంగా మిట్టదూరయ్య, అల్లాది పరమేశ్వర్ మాట్లాడుతూ, "షాద్‌నగర్ వాసవి, వనిత క్లబ్‌లు చేపడుతున్న సేవా కార్యక్రమాలు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం అభినందనీయమైన విషయం. ఇంటర్నేషనల్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచవ్యాప్తంగా ఏటా వందలాది కోట్ల రూపాయల విలువైన సామాజిక సేవలు అందుతున్నాయి. వాసవి క్లబ్ చేస్తున్న నిరుపమాన సేవలను గుర్తించి కేంద్ర ప్రభుత్వం పతకం ద్వారా సత్కరించడం క్లబ్ ప్రతిష్టను మరింత పెంచింది" అని పేర్కొన్నారు.ఈ వేడుకలో ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ దొంతు పాండురంగయ్య, అడిషనల్ ట్రెజరర్ సూరిశెట్టి నరసింహా గుప్తా, డిస్ట్రిక్ట్ క్యాబినెట్ సెక్రటరీ ఉప్పల శ్రీనివాస్, నీల విజయలక్ష్మి, డిస్ట్రిక్ట్ ట్రెజరర్ నర్సింలు, వాడకట్టు విజయకుమార్, గుడిపల్లి వెంకటరమణ, మాణిక్యం, ఆర్యవైశ్య అనుబంధ సంఘాల నాయకులు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## విద్యార్థులు సైన్స్ ప్రాముఖ్యత తెలుసుకోవాలి- ఎంఈఓ



**మహబూబాబాద్, ఫిబ్రవరి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** విద్యార్థులు సైన్స్ ప్రాముఖ్యతను తెలుసుకొని జీవితంలో అభివృద్ధి చెందాలని మండల విద్యాశాఖాధికారి సూచించారు. ఈ రోజు స్థానిక పీఎం శ్రీ జెడ్‌పి హెచ్‌ఎస్ (గర్ల్స్)లో ఘనంగా జరిగిన జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై సైన్స్ ఆకృతి మేళాను ప్రారంభించారు.ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులను పరిశీలించి అభినందించిన ఆయన, "ఇలాగే శాస్త్రీయ వైఖరులను పెంపొందించుకొని భవిష్యత్తులో గొప్ప శాస్త్రవేత్తలుగా ఎదగాలి" అని విద్యార్థులను ప్రోత్సహించారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏ. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, "ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, సైన్స్ ఉపాధ్యాయులు అభినందనీయులు. విద్యార్థులు శాస్త్రీయ ఆలోచనలతో ముందుకు సాగాలి" అని పేర్కొన్నారు.ఈ సందర్భంగా నిర్వహించిన వక్తృత్వ, వర్ణన పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సునీత, సుచిత్ర, శ్వేత, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయం



**మహబూబాబాద్, ఫిబ్రవరి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవాని నగర్ అభివృద్ధికి దాతలు ముందుకు రావడం అభినందనీయమని విద్యాశాఖ అధికారులు పేర్కొన్నారు. వేసవిలో విద్యార్థులకు చల్లని నీరు అందించాలనే ఉద్దేశంతో భవాని నగర్‌కు చెందిన బి. లచ్చిరాం నాయక్ వాటర్ కూలర్‌ను పాఠశాలకు బహుకరించారు.అలాగే రిటైర్డ్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అమనగల్‌కు చెందిన అనురాధ మేడం ఒక పెద్ద బీరువా, నాలుగు కుర్చీలు విరాళంగా అందించారు. ఈ వాటర్ కూలర్, బీరువా, కుర్చీలను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు టి. శోభారాణి ఆధ్వర్యంలో మండల విద్యాశాఖ అధికారి ఎస్. వెంకటేశ్వర్ రావు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు భూక్య సిరి నాయక్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు శోభారాణి మాట్లాడుతూ, "విద్యార్థుల సౌకర్యార్థం దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి విరాళాలు అందించడం పాఠశాల అభివృద్ధికి ఎంతో తోడ్పడుతుంది. వారికి ప్రత్యేక కృతజ్ఞతలు" అని తెలిపారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి. మాలతి, టి. చంద్రం, కవిత, సి.ఆర్.పీ. ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

# కంబాలపల్లి పాఠశాలలో ఘనంగా జాతీయ సైన్స్ డే వేడుకలు





**మహబూబాబాద్, ఫిబ్రవరి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పీఎం శ్రీ జడ్‌పి హెచ్‌ఎస్ కంబాలపల్లి పాఠశాలలో జాతీయ సైన్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు పలు కార్యక్రమాలు చేపట్టారు.పాఠశాలలో సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించగా, విద్యార్థులు తమ సృజనాత్మక ప్రాజెక్టులను ప్రదర్శించారు. రూపొందించిన నమూనాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అదేవిధంగా సైన్స్ క్విజ్, రంగోలి, డ్రాయింగ్, వ్యాసరచన పోటీలలో విద్యార్థులు శాస్త్రం, సాంకేతికత ప్రాముఖ్యతను వివరించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె. గిరిజ మాట్లాడుతూ, "భారత భౌతిక శాస్త్రవేత్త సి.వి. రామన్ కనుగొన్న రామన్ ప్రభావం భారతదేశానికి అంతర్జాతీయ ఖ్యాతిని తెచ్చింది. విద్యార్థులు శాస్త్రవేత్తల మార్గంలో నడిచి దేశాభివృద్ధికి కృషి చేయాలి" అని సూచించారు. సైన్స్ ఉపాధ్యాయులు జి. ఉప్పలయ్య, సోమేశ్వర్, ఝాన్సీ, ఎస్. వెంకటేశ్వర్లు కార్యక్రమాలను సమన్వయం చేశారు.చివరగా పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సోహన్ బీ, ఆర్. శ్రీధర్ రెడ్డి, కె. శ్రీనివాసరావు, తిరుపతి, షిబా రాణి, సతీష్ రెడ్డి, మల్లారెడ్డి, వెంకటేశ్వర్లు, కృష్ణమూర్తి, వీరభద్రం, యుగేందర్, కవిత తదితరులు పాల్గొన్నారు.

# తాగిన మైకంలో భార్యను చంపిన భర్త కేసు నమోదు




**తెలకపల్లి, ఫిబ్రవరి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలకపల్లి మండల పరిధిలో దారుణ ఘటన చోటుచేసుకుంది. తాగిన మైకంలో భర్త భార్యను హత్య చేసిన సంఘటన స్థానికంగా కలకలం రేపింది. స్థానిక ఎస్సై బి. నరేష్ తెలిపిన వివరాల ప్రకారం, బల్మూరు మండలం పోలిశెట్టిపల్లి గ్రామానికి చెందిన బంగారమ్మను 26 సంవత్సరాల క్రితం లక్నారం గ్రామానికి చెందిన మన్యం శ్రీనుతో వివాహం చేశారు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. గత మూడు సంవత్సరాలుగా భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. శుక్రవారం రాత్రి మద్యం మత్తులో మన్యం శ్రీను భార్యతో ఘర్షణకు దిగాడు. ఆ సమయంలో అల్యూమినియం రాడుతో దాడి చేయడంతో బంగారమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి అన్న ఆకారపు వెంకటయ్య శనివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బి. నరేష్ తెలిపారు.

# పలు గ్రామాలలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే





**-ప్రజల జీవితాల్లో కనిపిస్తున్న మార్పే అందుకు సాక్ష్యం.**
**- ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ .**

**దేవరకొండ ఫిబ్రవరి 28. (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
డిండి మండలంలోని ఎర్రగుంట పల్లి, వావిల్ కోల్ రహమంతాపూర్,కందుకూరు, సింగరాజు,పల్లి, తవక్లాపూర్ గ్రామాలలో నూతనంగా నిర్మించనున్న గ్రామ మహిళా సమాఖ్య కార్యాలయ భావన నిర్మాణ పనులకు ఎమ్మెల్యే బాలు నాయక్ సంబంధిత అధికారులు, స్థానిక నాయకులతో కలిసి శంకుస్థాపన చేశారు. కందుకూరు స్కూల్ కాంపౌండ్ వాల్ శంకుస్థాపన చేసిన అనంతరం సీసీ రోడ్డును ప్రారంభించారు.సింగరాజు పల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ ప్లాంట్ ను ప్రారంభించి, గ్రామస్తులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శక్రు తండాలో 5.00 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయడం జరిగింది.తవక్లాపూర్ గ్రామం నుండి వీరబోయిన వైజంక్షన్ వరకు 223.00 లక్షల రూపాయల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న బీటి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. చెర్కుపల్లి గ్రామంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు అడపాల పర్వత్ రెడ్డి ద్వాదశదిన కర్మ కార్యక్రమంలో పాల్గొని, పర్వత్ రెడ్డి చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించడం జరిగింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ....గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, మహిళా సంఘాల బలోపేతానికి ఈ విఓ భవనం ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు.ఉపాధి హామీ పథకం ఎన్ఆర్ఈజీఎస్ కింద మంజూరైన 10 లక్షల రూపాయలనిధులతో గ్రామ సమాఖ్య భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.నిర్ణీత కాలపరిమితిలోగా నాణ్యతతో ఈ భవన నిర్మాణాలను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.గ్రామంలోని మహిళా సంఘాలు మరియు స్థానిక అవసరాల కోసం కేటాయించిన నిధులతో నిర్మించనున్న భవనాలకు ఆయన భూమి పూజ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, మండల ముఖ్య నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# హాస్టల్‌లో అసభ్యకర ప్రవర్తన.

**- విద్యార్థినిని బహిష్కరించిన యూనివర్సిటీ**




**భోపాల్:ఫిబ్రవరి 28. (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
యూనివర్సిటీలో చదువుతున్న ఒక విద్యార్థిని హాస్టల్‌లో అసభ్యకరంగా, అభ్యంతరకరంగా ప్రవర్తించింది. దీంతో తోటి లేడీ స్టూడెంట్స్ ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో యూనివర్సిటీ హాస్టల్ నుంచి ఆ యువతిని బహిష్కరించారు. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో ఈ సంఘటన జరిగింది. దేవి అహల్య విశ్వవిద్యాలయంలో ఒక యువతి మొదటి సంవత్సరం చదువుతున్నది. క్యాంపస్‌లోని హాస్టల్‌లో నివసిస్తున్న ఆమె అనుచితంగా ప్రవర్తిస్తున్నది. మగవారితో వీడియో కాల్స్ మాట్లాడుతూ అసభ్యకర చేష్టలు చేస్తున్నది. అలాగే మొబైల్ అప్లికేషన్ ద్వారా తెలియని పురుషులతో స్నేహం చేసి మాట్లాడాలని లేడీ స్టూడెంట్స్‌ను ప్రోత్సహిస్తున్నది.కాగా, ఆ విద్యార్థినిపై పలు ఆరోపణలు, ఫిర్యాదులు వచ్చాయి. దీంతో దర్యాప్తు కోసం అంతర్గత విచారణ కమిటీని ఏర్పాటు చేశారు. ఆ యువతి గదిలో హాస్టల్ వార్డెన్ సోదా చేశారు. అభ్యంతరకరమైన వస్తువులను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.మరోవైపు ఆ విద్యార్థిని వల్ల హాస్టల్‌లోని ఇతర విద్యార్థినులకు తీవ్రమైన సమస్యలు తలెత్తవచ్చని దేవి అహల్య యూనివర్సిటీ యాజమాన్యం భావించింది. ఈ నేపథ్యంలో ఆ యువతిని వెంటనే హాస్టల్ నుంచి బహిష్కరించినట్లు వైస్ ఛాన్సలర్ రాకేష్ సింఘై తెలిపారు.

# 331 మంది ఆఫ్ఘన్ తాలిబన్ సిబ్బంది హతం:



**ఇస్లామాబాద్ ఫిబ్రవరి 28. (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
పాకిస్థాన్, ఆఫ్ఘనిస్తాన్ మధ్య ఘర్షణలో చోటుచేసుకుంటున్న విషయం తెలిసిందే. రెండు రోజుల క్రితం ఆఫ్ఘనిస్తాన్‌లోని పలు మిలిటరీ కేంద్రాలపై పాకిస్థాన్ వైమానిక దాడలు చేసింది. టెర్రరిస్టు గ్రూపులపై చేసిన దాడుల్లో సుమారు 331 మంది ఆఫ్ఘన్ తాలిబన్ సిబ్బంది మృతిచెందినట్లు పాకిస్థాన్ అధికారులు చెప్పారు. మిలిటెంట్ల ఏరివేత ఆపరేషన్ కొనసాగుతున్నట్లు పాకిస్థాన్ పేర్కొన్నది. పాక్ సమాచార శాఖ మంత్రి అత్తావుల్లా తారర్ ఈ విషయాన్ని వెల్లడించారు.అర్ధరాత్రి వరకు సుమారు 331 మంది ఆఫ్ఘన్ తాలిబన్ సిబ్బంది హతమయ్యారని, మరో 500 మంది ఆఫ్ఘన్ సిబ్బంది గాయపడినట్లు ఆయన చెప్పారు. ఆఫ్ఘనిస్తాన్‌కు చెందిన 104 పోస్టులను ధ్వంసం చేశామన్నారు. ఆపరేషన్ ఘజబ్ లిల్‌హక్‌లో భాగంగా 22 పోస్టులను స్వాధీనం చేసుకున్నట్లు కూడా చెప్పారు. ఈ ఆపరేషన్‌లో సుమారు 163 ట్యాంక్‌లు, ఆయుధ వాహనాలు ధ్వంసం అయ్యాయి. ఆఫ్ఘన్ బోర్డర్‌లో ఉన్న 29 లొకేషన్లను వైమానిక దళం టార్గెట్ చేసినట్లు మంత్రి తెలిపారు.

# ఒకే రోజు మహిళపై రెండుసార్లు అత్యాచారం..

**భువనేశ్వర్ ఫిబ్రవరి 28. (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
ఒక మహిళపై ఒకే రోజు రెండుసార్లు అత్యాచారాలు జరిగాయి. మొదట పెళ్లి పేరుతో రప్పించి ప్రియుడు రేప్ చేశాడు. బస్టాండ్ వద్ద ఒంటరిగా ఉన్న ఆమెను సహాయం పేరుతో మరో వ్యక్తి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆ తర్వాత ఆ మహిళను బిల్డింగ్ పైనుంచి కిందకు తోసి హత్య చేశాడు. ఒడిశాలోని జగత్‌సింగ్‌పూర్ జిల్లాలో ఈ దారుణం జరిగింది. ఫిబ్రవరి 22న తిర్టోల్ ప్రాంతానికి చెందిన 23 ఏళ్ల మహిళ ప్రియుడితో కలిసి పారిపోయేందుకు ఇంటి నుంచి బయటకు వెళ్లింది.కాగా, పెళ్లి చేసుకుంటానని నమ్మించిన ప్రియుడు ఆమెను ఒక గుడి వద్దకు రప్పించాడు. ఆ తర్వాత ఏకాంత ప్రదేశానికి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. అనంతరం రహమా బస్ స్టాండ్ వద్ద ఆ మహిళను వదిలేసి వెళ్లిపోయాడు. అయితే బస్టాండ్ వద్ద ఒంటరిగా, నిరాశతో ఉన్న ఆ మహిళను బైక్‌పై వెళ్తున్న




జార్ఖండ్‌కు చెందిన వ్యక్తి చూశాడు. సహాయం చేస్తానని చెప్పి ఆమెను బైక్‌పై పారాదీప్ తీసుకెళ్లాడు. అద్దె ఇంటి బిల్డింగ్‌పైన ఆ మహిళపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆ తర్వాత ఆమెను బిల్డింగ్ నాలుగో అంతస్తు నుంచి కిందకు తోసి హత్య చేశాడు. మరునాడు ఆ మహిళ మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఆమె మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం తరలించారు. మహిళ మిస్సింగ్‌పై సోదరుడు ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలుసుకున్నారు. మరోవైపు ఆ మహిళపై ఒకే రోజు ప్రియుడు, మరో వ్యక్తి అత్యాచారం చేయడంతో పాటు ఆమెను హత్య చేసినట్లు దర్యాప్తులో బయటపడటంతో పోలీసులు షాక్ అయ్యారు. ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు పోలీస్ అధికారి తెలిపారు. వారిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. కాగా, మాజీ సీఎం, అసెంబ్లీలో ప్రతిపక్ష నేత, బీజేడీ అధినేత నవీన్ పట్నాయక్ ఈ సంఘటనను ఖండించారు. మహిళలపై నేరాలు పెరుగడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఇంకా ఎంతమంది అమాయకులు ప్రాణాలు కోల్పోవాలి? అని బీజేపీ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

# నేనొక మంచి తండ్రిగా లేను'..

**ఉక్రెయిన్ అధ్యక్షుడి ఆవేదన**

**న్యూఢిల్లీ ఫిబ్రవరి 28. (నీలగిరి ఎక్స్ ప్రెస్).**



తానొక మంచి తండ్రిగా లేనని ఉక్రెయిన్ అధ్యక్షుడ వాలోదిమిర్ జెలెన్‌స్కీ ఆవేదన వ్యక్తంచేశారు. రష్యా దురాక్రమణను అడ్డుకునే క్రమంలో భద్రతా కారణాలరీత్యా తాను తన పిల్లలను చూడలేకపోతున్నానని, వారికి సమయం కేటాయించలేకపోతున్నానని చెప్పారు. కాగా రష్యా–ఉక్రెయిన్ మధ్య నాలుగేళ్లకుపైగా యుద్ధం కొనసాగుతోంది. దాంతో తాను తన కుటుంబాన్ని ఎంత మిస్సవుతున్నాడో జెలెన్‌స్కీ చెప్పారుమాస్కోతో యుద్ధంవల్ల తాను తన కుటుంబానికి సమయం వెచ్చించలేకపోతున్నట్లు జెలెన్‌స్కీ తెలిపారు. ఓ వార్తా సంస్థతో ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. యుద్ధం సమయంలో కుటుంబానికి ఎక్కువ సమయం వెచ్చించలేకపోతున్నట్లు పేర్కొన్నారు. ఉక్రెయిన్ అధ్యక్షుడిగా దేశాన్ని కాపాడుకోవడానికే ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. తన పిల్లలకు సమయం కేటాయించలేకపోతున్నానని, వారికి మంచి తండ్రిగా ఉండలేకపోతున్నానని ఉద్వేగానికి గురయ్యారు. దేశంలో శాంతి నెలకొల్పేందుకు అనేక ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు. భద్రతా కారణాల దృష్ట్యా యుద్ధ సమయంలో తన పిల్లలను చూడలేకపోవడం గురించి జెలెన్‌స్కీ గతంలోను మాట్లాడారు. మాస్కో దురాక్రమణలను అడ్డుకునే శక్తి అమెరికాకు ఉందన్నారు. యుద్ధం ముగింపునకు రష్యా అధ్యక్షుడు పుతిన్‌పై ఒత్తిడి తీసుకురావాలని యూఎస్‌ను కోరారు. మార్చిలో అమెరికా నేతృత్వంలో శాంతి చర్చలు జరిగే అవకాశం ఉందని చెప్పారు.

# డేటా సెంటర్లతో బెంగళూరులో నీటి సంక్షోభం

**-ఇంకిపోయిన భూగర్భ జలాలు**
**-ట్యాంకర్లపై ఆధారపడుతున్న జనం**
**- నిపుణుల హెచ్చరికలు పట్టని ప్రభుత్వం**



**బెంగళూరు ఫిబ్రవరి 28. (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
తాగునీటి సంక్షోభం బెంగళూరు నగరాన్ని భయపెడుతోంది. ఇబ్బడిముబ్బడిగా ఏర్పాటవుతున్న డేటా సెంటర్లు నగర వాసులను గుక్కెడు నీటికి కష్టపడేలా చేస్తున్నాయి. క్లౌడ్ కంప్యూటింగ్, కృత్రిమ మేధస్సుకు వెన్నెముకగా భావించే డేటా సెంటర్లు బెంగళూరులో విస్తృతంగా ఏర్పాటయ్యాయి. ఇప్పటికే డేటా సెంటర్ హబ్‌గా ఉన్న బెంగళూరులో భవిష్యత్‌లో మరిన్ని ఏర్పాటు కానున్నాయి. కర్ణాటకలో ప్రస్తుతం 32 డేటా సెంటర్లు క్రియాశీలకంగా ఉన్నాయని, వీటిలో 31 బెంగళూరులోనే ఉన్నాయని ఆ రాష్ట్ర ఐటి మంత్రి ప్రియాంక్ ఖర్గే ఇటీవల మీడియాకు తెలిపారు. మరో పది డేటా సెంటర్లు ఏర్పాటు కానున్నాయని వివరించారు. బెంగళూరు వైట్‌ఫీల్డ్ ప్రాంతంలోనే 120 మెగావాట్ల సామర్థ్యంతో పని చేసే ఏడు ప్రధాన డేటా సెంటర్లు ఉన్నాయి. ఇవన్నీ ప్రపంచ ప్రసిద్ధి పొందిన కంపెనీలు ఏర్పాటు చేసినవి. ప్రస్తుతం కృత్రిమ మేధస్సు రంగంలో పరిశోధనా కార్యకలాపాలు విస్తరిస్తుండటంతో ఈ డేటా సెంటర్లను ఆయా కంపెనీలు 'ఎఐ రెడీ' లేదా 'ఎఐ డేటా సెంటర్లు'గా పేర్కొంటున్నాయి. అంటే ఈ సెంటర్లలో పనిభారం ఎక్కువగా ఉంటుందని నేరుగా చెప్పడమే. డేటాసెంటర్లు వినియోగించుకునే మెగావాట్లు పెరిగే కొద్దీ.. వాటికి అంతే స్థాయిలో నీటి అవసరం పెరుగుతుంది. డేటా సెంటర్లలో ఉండే సర్వర్లు విద్యుత్ ఆధారంగా పని చేస్తాయి. సర్వర్లు చాలా వేడిగా ఉండటంతో ఇక్కడ వినియోగించే నీరు చాలా త్వరగా ఆవిరిగా మారిపోతుంది. ఇటీవల డెలాయిట్ సంస్థ చేసిన అధ్యయనం ప్రకారం ఒక మెగావాట్ సామర్థ్యం ఉన్న డేటా సెంటర్‌కు రోజుకు 68,500 లీటర్ల నీరు అవసరం. ఎఐ డేటా సెంటర్లన్నీ 20 మెగావాట్ల సామర్థ్యంతో ఉంటాయి. రోజుకు సుమారు 14 లక్షల లీటర్లు అవసరం అవుతాయి. ఇది పట్టణాల్లోని 27 వేల ఇళ్లలో రోజువారీ అవసరాలకు వినియోగించే నీటితో సమానం. ప్రస్తుతం తాగునీటికే కటకటలాడుతున్న బెంగళూరు నుంచి డేటాసెంటర్లకు ఇంత నీటిని తరలించడం ఇక్కడ ప్రజల నీటి కష్టాలను మరింతగా పెంచడమే. ప్రస్తుతం బెంగళూరులో గృహ, పారిశ్రామిక అవసరాలకు కనీసం 30 లక్షల లీటర్లు నీరు అవసరం. ఇందులో 20 లక్షల లీటర్లను కావేరి నది నుంచి పంప్ చేస్తున్నారు. పట్టణానికి సుమారు 100 కిలోమీటర్ల దూరం నుంచి ఈ పంపింగ్ జరుగుతోంది. మిగిలినది భూగర్భ జలాల ద్వారా తీసుకోవాల్సి ఉంది. నగరంలో భూగర్భ జలాలు వేగంగా క్షీణించడంతో రోజువారీ నీటి సమస్య తీవ్రంగా ఉంది.

# బిజినెస్

## ఇక్కడ లీటర్ పెట్రోల్ కేవలం రూ. 2 మాత్రమే..

**ఆశ్చర్యపడేలోపే షాక్ అవుతారు.!**



భారతదేశంలో ప్రస్తుతం పెట్రోల్, డీజిల్ ధరలు రూ.100కు పైగా ఉన్నాయి. లీటర్ పెట్రోల్ లేదా డీజిల్ కొనుగోలు చేయాలంటే రూ.100 కన్నా తక్కువకు ఎక్కడా లభించడం లేదు. గత కొన్నేళ్లలో ఈ ధరలు విపరీతంగా పెరిగాయి. అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు తగ్గుతున్నప్పటికీ, భారత్‌లో పెట్రోల్ ధరలు మాత్రం తగ్గడం లేదు. ఈ క్రమంలోనే చాలామంది ప్రజలు ఎలక్ట్రిక్ వాహనాల వైపు మొగ్గు చూపుతున్నారు. భారత్‌లో ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోళ్లు ఏటా పెరుగుతున్నాయి. భారత్‌లో పెట్రోల్ ధరలు చాలా ఎక్కువగా ఉండగా, ప్రపంచంలోని కొన్ని దేశాల్లో లీటర్ పెట్రోల్ కేవలం రూ.2 నుంచి రూ.3కే లభిస్తుంది. ప్రపంచంలోనే అత్యంత తక్కువ ధరకే పెట్రోల్ లభించే దేశాలలో లిబియా ముందుంది. అక్కడ లీటర్ పెట్రోల్ ధర 0.024 డాలర్లుగా ఉంది. ఇది భారత కరెన్సీలో సుమారు రూ.2.15కు సమానం. ధరల్లో మార్పులను బట్టి ఇది సుమారు రూ.3 వరకు చేరుకోవచ్చు. లిబియా తర్వాత ఇరాన్‌లో కూడా అత్యంత చౌక ధరకే పెట్రోల్ దొరుకుతుంది. ఇక్కడ లీటర్ పెట్రోల్ ధర 0.029 డాలర్లు, అంటే ఇండియన్ కరెన్సీలో కేవలం రూ.2.50కి లభిస్తుంది. ఇక లిబియా, ఇరాన్ తర్వాత వెనిజులా మూడో స్థానంలో ఉంది. ఇక్కడ లీటర్ పెట్రోల్ 0.035 డాలర్లు, ఇది భారతీయ కరెన్సీలో సుమారు రూ.3గా ఉంటుంది. పెట్రోల్ ధర తక్కువగా ఉన్న దేశాల్లో అంగోలా నాలుగో స్థానంలో ఉంది, ఇక్కడ లీటర్ పెట్రోల్ కేవలం రూ.27కు లభిస్తుంది. తర్వాతి స్థానంలో కువైట్ ఉంది, అక్కడ లీటర్ పెట్రోల్ ధర రూ.28గా కొనసాగుతోంది.

## భారీగా పెరిగిన బంగారం ధర.. ఎంత పెరిగిందంటే

దేశంలో బంగారం ధరలు మళ్లీ పెరిగాయి. గత కొంత కాలం నుంచి గోల్డ్ రేటు పసిడి ప్రియులకు షాక్ ఇస్తోంది. తగ్గినట్లే తగ్గి మళ్లీ అమాంతం ఎగబాకుతున్నాయి. అంతర్జాతీయంగా నెలకొన్న పరిస్థితులు పసిడి ధరల మార్పునకు కారణం అవుతున్నాయి. అమెరికాలో ఈ మధ్య జరిగిన పరిణామాలతో కూడా పెట్టుబడిదారులు అప్రమత్తమయ్యారు. డాలర్ బలహీనపడటంతో పెట్టుబడులను బంగారం వైపు మళ్లించారు. దీంతో బంగారం ధరలు మళ్లీ పెరుగుతున్నాయి. ఫిబ్రవరి 28 శనివారం 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం పై రూ.3,160 లు పెరిగి రూ.1,64,730 లకు చేరింది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారంపై రూ. 2,900 పెరిగి రూ.1,51,000లు పలుకుతోంది. ఇక వెండి ధర కూడా కేజీపై రూ.5,000లు పెరిగి రూ.3,00,000లకు చేరింది. ఫిబ్రవరి 28, శనివారం దేశంలోని వివిధ




నగరాల్లో బంగారం, వెండి ధరలను పరిశీలిస్తే.. దేశరాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,64,880 వద్ద ట్రేడవుతోంది. అలాగే 22 క్యారట్ల బంగారం ధర రూ.1,51,150 పలుకుతోంది. ముంబై, కోల్‌కతాలో 24 క్యారెట్ల బంగారం రూ.1,64,730 ఉంటే, 22 క్యారెట్ల బంగారం రూ.1,51,000 పలుకుతోంది. చెన్నైలో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,65,820 ఉంటే, 22 క్యారెట్ల బంగారం ధర రూ. రూ.1,52,000 గా ఉంది. తెలుగు రాష్ట్రాల్లోని హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నంలో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,64,730 ఉంటే, 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,64,730 లు పలుకుతోంది. వెండి ధర కేజీ రూ.3,00,000 గా కొనసాగుతోంది. మార్కెట్ కు అనుగుణంగా ఈ ధరలు పెరగవచ్చు, తగ్గవచ్చు.. బంగారం కొనడానికి వెళ్లేముందు ధరలు మరోసారి చెక్ చేసుకోవాలి.

## దలాల్ స్ట్రీట్‌లో యుద్ధ కల్లోలమే..!

**-వచ్చే వారం కుప్పకూలనున్న మార్కెట్లు**
**-అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచన**

**ముంబయి**

అమెరికా యుద్ధోన్మాదం దలాల్ స్ట్రీట్‌ను గడగడలాడించే అవకాశాలు మెండుగా కనబడుతోన్నాయి. యుఎస్ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చర్యలతో పశ్చిమ ఆసియాలో యుద్ధ జ్వాలలు ఎగిసిపడుతుండటంతో అంతర్జాతీయ మార్కెట్లలో తీవ్ర ఆందోళన మొదలయ్యింది. ఇరాన్‌పై ఇజ్రాయెల్ ముందస్తు దాడులు చేయడంతో సోమవారం దలాల్ స్ట్రీట్ భారీ నష్టాలతో ప్రారంభమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. అణు ఒప్పందంపై నెలకొన్న విభేదాల నేపథ్యంలో అమెరికా అండతో ఇజ్రాయెల్ ఈ దాడులకు తెగబడటంతో వచ్చే వారం భారత మార్కెట్లు తీవ్ర ప్రతికూలతను ఎదుర్కొనున్నాయని నిపుణులు అంచనా





వేస్తోన్నారు. మధ్యప్రాచ్యంలో దశాబ్దాల కాలంలో ఎప్పుడూ లేనంతగా అమెరికా తన నౌకాదళాన్ని మోహరించింది. శనివారం ఇరాన్ కూడా ప్రతిదాడికి దిగడంతో ఇజ్రాయెల్ గగనతల రక్షణ వ్యవస్థలు అప్రమత్తమయ్యాయి. ఈ ఉద్రిక్తతలు ప్రపంచ దేశాల మార్కెట్లను వణికిస్తున్నాయి. గత శుక్రవారం సెన్సెక్స్ 961 పాయింట్లు, నిఫ్టీ 317 పాయింట్లు నష్టపోయాయి. ఫిబ్రవరి 27తో ముగిసిన వారంలో సెన్సెక్స్ దాదాపు 2300 పాయింట్లు, నిఫ్టీ 750 పాయింట్ల వరకు లేదా 2.5-3 శాతం మేర పతనమయ్యాయి. సోమవారం నుంచి ఈ పతనం మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని వెల్త్‌మిల్స్ సెక్యూరిటీస్ డైరెక్టర్ క్రాంతి బత్తిని హెచ్చరించారు. ముఖ్యంగా ముడి చమురు ధరలు బ్యారెల్ 80 డాలర్లు దాటితే భారత ఆర్థిక వ్యవస్థపై భారం పడుతుందని ఆయన విశ్లేషించారు. ఐటి మినహా ఆటో, చమురు, ఫైనాన్షియల్, ఎఫ్‌ఎంసిజి రంగాలు ఇప్పటికే అమ్మకాల ఒత్తిడిలో ఉన్నాయి. ప్రస్తుతానికి పాత స్టాక్స్‌ను తగ్గించుకుని, యుద్ధ తీవ్రత తగ్గే వరకు వేచి చూడటం ఉత్తమమని మార్కెట్ నిపుణుడు అనుజ్ గుప్తా పేర్కొన్నారు. కొత్తగా పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టేటప్పుడు ఆచి తూచి వ్యవహరించాలన్నారు. ముఖ్యంగా రిటైల్ ఇన్వెస్టర్లు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని నిపుణులు సూచిస్తున్నారు.

## పాక్ నిష్క్రమణ.. సెమీఫైనల్ వేదికలు ఖరారు..!

పొట్టి ప్రపంచకప్ నుంచి పాకిస్థాన్ నిష్క్రమించడంతో భారత్‌లోనే బిగ్ మ్యాచ్‌లు జరుగనున్నాయి. సూపర్ 8 చివరి మ్యాచ్‌లో శ్రీలంకను 147లోపు కట్టడి చేయలేక పాక్ ఇంటిదారి పట్టడంతో సెమీస్ వేదికలపై నెలకొన్న సందిగ్ధతకు తెరపడింది. న్యూజిలాండ్ ఫైనల్ చేరడంతో.. ఈడెన్ గార్డెన్స్, వాంఖడేలో సెమీ ఫైనల్ మ్యాచ్‌లు నిర్వహించేందుకు బీసీసీఐ సిద్ధమవుతోంది.

గ్రూప్ బీ నుంచి న్యూజిలాండ్ సెమీస్ బెర్తు పట్టేయగా.. భారత్‌లోనే షెడ్యూల్ ప్రకారం అనుకున్న సెమీ ఫైనల్, ఫైనల్ వేదికల్ని ఐసీసీ, బీసీసీఐ ఖరారు చేశాయి. ఒకవేళ పాక్ అర్హత సాధించి ఉంటే కొలంబోలోనే సెమీస్, ఒకవేళ ఫైనల్‌కు చేరితే.. ఈ మ్యాచ్ కూడా అక్కడే ఆడించాల్సి వచ్చేది. కానీ, సల్మాన్ అఘా బృందం గెలిచినా కివీస్ రన్ రేటు(+1.390)ను అధిగమించలేకపోవడం భారత్‌కు ప్లస్ అయింది. మార్చి 4న జరిగే తొలి సెమీస్‌ను కోల్‌కతాలోని




ఈడెన్ గార్డెన్స్‌లో, మార్చి 5న రెండో సెమీస్ మ్యాచ్‌ను ముంబైలోని వాంఖడేలో నిర్వహించనున్నారు. టైటిల్ పోరు అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో మార్చి 8వ తేదీన జరుగనుంది.

**రత్ననాయకే, షనక మెరుపులు**

పొట్టి ప్రపంచకప్ నుంచి వెళ్తూ వెళ్తూ పాకిస్థాన్‌ను తీసుకెళ్లింది శ్రీలంక. ఆద్యంతం ఉత్కంఠగా సాగిన సూపర్ 8 చివరి మ్యాచ్‌లో పాక్ సెమీస్ ఆశల్ని ఆవిరి చేసింది ఆతిథ్య జట్టు. ఓపెనర్ ఫర్హాన్(100) సెంచరీ, ఫఖర్ జమాన్(84) విధ్వంసంతో భారీ స్కోర్ చేసిన పాక్.. లంకను 147లోపే కట్టడి చేయలేకపోయింది. దసున్ శనక(76 నాటౌట్), పవన్ రత్ననాయకే(58)లు చితక్కొడుతూ పాక్ బౌలర్లను నీరుగార్చారు. ఫలితంగా గ్రూప్ బీ నుంచి న్యూజిలాండ్ సెమీస్‌కు దూసుకెళ్లింది. ఓదార్పు విజయంతో సల్మాన్ అఘా బృందం టోర్నీ నుంచి నిష్క్రమించింది. శ్రీలంకను 147లోపు కట్టడి చేయలేకపోయారు. స్పిన్నర్లు చెలరేగినా.. పవన్ రత్ననాయకే(58) అర్ధశతకంతో విరుచుకుపడి పాక్ ఆశలపై నీళ్లు చల్లాడు

# స్పోర్ట్స్

## అక్షర్ పటేల్, అర్ష్‌దీప్‌లపై నెటిజన్ల ఆగ్రహం







టీమిండియా స్టార్ క్రికెటర్ రింకూ సింగ్ ఇంట్లో తీవ్ర విషాదం నెలకొన్న వేళ, సహచర ఆటగాళ్ల ప్రవర్తన ఇప్పుడు సోషల్ మీడియాలో పెను దుమారం రేపుతోంది. లివర్ క్యాన్సర్‌తో పోరాడుతూ రింకూ తండ్రి ఖాన్‌చంద్ సింగ్ శుక్రవారం (ఫిబ్రవరి 27) కన్నుమూశారు. తండ్రి మరణ వార్త విన్న వెంటనే రింకూ సింగ్ చెన్నైలో ఉన్న జట్టును విడిచిపెట్టి, తన స్వగ్రామమైన అలీగఢ్‌కు చేరుకుని అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఒకవైపు రింకూ పుట్టెడు దుఃఖంలో ఉంటే, మరోవైపు భారత జట్టులోని కీలక ఆటగాళ్లైన అక్షర్ పటేల్, అర్ష్‌దీప్ సింగ్‌లు విమానంలో సరదాగా జోకులు వేసుకుంటూ రీల్స్ చేయడం అభిమానులకు తీవ్ర ఆగ్రహాన్ని కలిగిస్తోంది. వివరాల్లోకి వెళ్తే.. చెన్నైలో జింబాబ్వేతో మ్యాచ్ ముగించుకున్న భారత జట్టు, తదుపరి మ్యాచ్ కోసం కోల్‌కతాకు విమానంలో బయలుదేరింది. ఈ ప్రయాణంలో అక్షర్ పటేల్ తన స్నాప్‌చాట్ ఖాతాలో ఒక వీడియోను పోస్ట్ చేశాడు. అందులో అర్ష్‌దీప్ సింగ్, అక్షర్ కలిసి జస్ప్రీత్ బుమ్రాను ఆటపట్టించడం, మహమ్మద్ సిరాజ్‌తో కలిసి నవ్వుతూ జోకులు వేయడం కనిపించింది. రింకూ సింగ్ తన తండ్రి అంత్యక్రియల్లో పాల్గొంటున్న అదే సమయంలోనే ఈ వీడియో సోషల్ మీడియాలో ప్రత్యక్షం కావడంతో నెటిజన్లు వీరిద్దరిపై విరుచుకుపడుతున్నారు. "మీకు కొంచెమైనా సిగ్గు ఉందా? మీ సహచర ఆటగాడి తండ్రి చనిపోతే కనీసం ఒక్కరోజు కూడా ఆగలేరా?" అంటూ అభిమానులు ఎక్స్‌లో దుమ్మెత్తిపోస్తున్నారు. ఒక జట్టుగా ఉన్నప్పుడు తోటి ఆటగాడి కష్టంలో పాలుపంచుకోవాల్సింది పోయి, ఇలా రీల్స్ చేస్తూ ఎంజాయ్ చేయడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. బుమ్రా ఆ వీడియోలో వారిని పట్టించుకోకుండా సీరియస్‌గా ఉండటాన్ని గమనించిన నెటిజన్లు, బుమ్రాకు ఉన్నంత మెచ్యూరిటీ కూడా వీరికి లేదు అంటూ కామెంట్స్ చేస్తున్నారు. సోషల్ మీడియా అంతా షేమ్ షేమ్ అంటూ వీరిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తండ్రిని కోల్పోయిన బాధలో ఉన్నప్పటికీ, రింకూ సింగ్ మార్చి 1న కోల్‌కతాలో వెస్టిండీస్‌తో జరగబోయే కీలకమైన సూపర్-8 మ్యాచ్ కోసం మళ్ళీ జట్టుతో చేరనున్నాడు. టీమ్ ఇండియా సెమీఫైనల్ చేరాలంటే ఈ మ్యాచ్ గెలవడం అత్యంత ముఖ్యం. ఇలాంటి ఒత్తిడి సమయంలో జట్టులో ఐక్యత, ఒకరిపై ఒకరికి గౌరవం ఉండాలని, ఇలాంటి సున్నితమైన విషయాల్లో ఆటగాళ్లు మరింత బాధ్యతగా ఉండాలని క్రీడా విశ్లేషకులు సూచిస్తున్నారు. అక్షర్, అర్ష్‌దీప్ చేసిన ఈ పని ఇప్పుడు భారత క్రికెట్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

## చరిత్ర సృష్టించిన జమ్మూకశ్మీర్..
## తొలిసారి రంజీ ట్రోఫీ కైవసం

**హుబ్లీ**

జమ్మూకశ్మీర్ క్రికెట్ జట్టు చరిత్ర సృష్టించింది. రంజీ ట్రోఫీని మొట్ట మొదటి సారి గెలుచుకున్నది. కర్నాటకతో హుబ్లీలో జరిగిన ఫైనల్ మ్యాచ్ డ్రాగా ముగిసింది. దీంతో ఫస్ట్ ఇన్నింగ్స్‌లో భారీ ఆధిక్యాన్ని సాధించిన జమ్మూకశ్మీర్ జట్టుకు రంజీ ట్రోఫీ దక్కింది. ఇవాళ అయిదో రోజు జమ్మూకశ్మీర్ బ్యాటర్లు కర్నాటక బౌలర్లను ధీటుగా ఎదుర్కొన్నారు. జేకే బ్యాటర్లు కమ్రాన్ ఇక్బాల్, సాహిల్ లోత్రాలు.. కర్నాటక బౌలర్లను



ఆటాడుకున్నారు. ఆ ఇద్దరూ అయిదో వికెట్ అజేయంగా 197 రన్స్ జోడించారు. కమ్రాన్ ఇక్బాల్ 160 , సాహిల్ లోత్రా 101 రన్స్ చేసి క్రీజ్‌లో ఉన్నారు. రెండో ఇన్సింగ్‌లో ఇవాళ జమ్మూకశ్మీర్ జట్టు 4 వికెట్లు కోల్పోయి 342 రన్స్ చేసిన సమయంలో ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. జేకే జట్టు మొత్తం 633 పరుగుల ఆధిక్యాన్ని సాధించింది. అయితే కర్నాటక, జమ్మూకశ్మీర్ కెప్టెన్లు డ్రాకు అంగీకరించడంతో.. రంజీ ట్రోఫీ జేకే జట్టును వరించింది.